ప్రజాశక్తి ఆదివారం అనుబంధం
ఆగస్టు 20, 2006
ఫోరెన్సిక్ సైన్స్
తిరుగులేని సాక్ష్యం

హ్యాపీ బర్త్‌డే

(20.8.2006 నుంచి 26.8.2006వరకు)

వి. ప్రవల్లిక
5సం॥, ఆగస్టు-20
రాణి-విజయ్‌కుమార్
హైదరాబాద్

కె. రజాక్
2సం॥, ఆగస్టు-21
ఖాజాబీ-రుక్కుద్దీన్
పాణ్య-కర్నూలు

పి. ఆదిత్య
7సం॥, ఆగస్టు-21
రాధ-చంద్రయ్య
బుద్ధారం-మ॥నగర్

పి. గౌతం
ఆగస్టు-23
రాధ-చంద్రయ్య
బుద్ధారం-మ॥నగర్

ఎం. సందీప్
4సం॥, ఆగస్టు-23
రంగమ్మ-రాజు
ముజఫర్‌నగర్-కర్నూలు



బి. సాత్విక
10సం॥, ఆగస్టు-21
రాజేశ్వరి-సుదర్శనాచారి
కల్లూరు-ఖమ్మం

వల్లభరాయుడు
7సం॥, ఆగస్టు-22
పద్మకుమారి-సోమనాథ్‌బాబు
కృష్ణలంక-విజయవాడ

కె. నవీన్(బన్ని)
2సం॥, ఆగస్టు-23
దమయంతి-ఉమాశంకర్
వజ్జాపేట-శ్రీకాకుళం

బి. మేఘన
3సం॥, ఆగస్టు-23
మణిశ్రీ-బాలకిషన్
సింగంపూర్-రంగారెడ్డి

డి. నవ్య
3సం॥, ఆగస్టు-24
నాగమణి-నర్సింహారావు
రాయగూడెం-ఖమ్మం

ఎం. సోనాలి
4సం॥, ఆగస్టు-24
ఇంద్ర-యాదయ్య
భూపేష్ గుప్తనగర్-హైదరాబాద్

కె. ప్రవీన్
6సం॥, ఆగస్టు-24
రమణమ్మ-సురేష్
పెద్దగంట్యాడ-విశాఖపట్నం

బి. భానుప్రకాష్
6సం॥, ఆగస్టు-2000
బాలమ్మ-కృష్ణయ్య
మాధవానిపల్లి-మ॥నగర్

కె. కాంక్షిత్‌మిన్ను
2సం॥, ఆగస్టు-2004
రమాదేవి-గోవర్ధనాచారి
దేవరపల్లి-మ॥నగర్

జి. శ్రావణి- జి. నరేంద్ర
5సం॥, ఆగస్టు-2001, 3సం॥, ఆగస్టు-2003
శారద-నాగేశ్వర్
దుద్ది గ్రామము-కర్నూలు

ప్రజాస్వామ్యాన్ని బతికించాలి

మన అతిథి గురించి...

పేరు	:	అగరాల ఈశ్వర్‌రెడ్డి
పుట్టింది	:	1-07-1934, తూకివాకం గ్రామ పంచాయతి, రేణిగుంట మండలం.
విద్య	:	ఎం.ఎ. పాలిటిక్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎం.ఎ. ఎకనామిక్స్ అండ్ హిస్టరీ
ఉద్యోగం	:	అసెంబ్లీ మాజీ స్పీకర్
రచనలు	:	ది ఎలక్ట్రోల్ రిఫార్మ్స్ ఇన్ ఇండియా, స్టేట్ పాలిటిక్స్ ఇన్ ఇండియా, ది మెమోరీస్ ఆఫ్ ఎ స్పీకర్
అవార్డులు	:	శ్రమశక్తి, సేవారత్న
ప్రత్యేకత	:	విద్యాభివృద్ధికి సహకరించడం.
ఆశయం	:	గాంధేయవాదం అంటే ఇష్టం. దానికనుగుణంగా పని చేశాను. చేస్తున్నాను. హింసావాదం నచ్చదు. మొదటి నుండి దాన్ని వ్యతిరేకిస్తున్నాను.లోకమంతా గాంధేయవాదాన్ని అనుసరించేలా కృషి చేస్తాను.

దేశ రాజకీయాలు ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలి. ప్రస్తుతమున్న రాజకీయాలు పూర్తి అవినీతిమయంగా మారాయి. ఈ పరిస్థితి నుండి బయటపడాలి. నాయకులు రాజకీయాలను వ్యాపారంగా భావిస్తున్నారు. ఈ ధోరణి మారాలి. ఈ పరిస్థితిని మార్చే బాధ్యత యువత తీసుకోవాలి. అవినీతికి పాల్పడే నాయకులను నిలదీయాలి. ఓటు హక్కును ఆయుధంగా ఉపయోగించుకుని ప్రజాస్వామ్యాన్ని బతికించాలి.

ఈ సంచికలో...

టపా ... 2
టర్నింగ్ పాయింట్ ... 4
సలహాలు ... 5
ఇంటి సంగతులు ... 6
క్యాంపస్ ఛాట్ ... 10
సినిమా కబుర్లు ... 11
బాలనేస్తాలు ... 12
అట్టమీది కథ ... 14
సెన్సా కామన్ సెన్సు ... 20

ఇలా వుందామా... 7

బద్ధకిస్టు

ఇంకా...

సీరియల్ 8

తెలుగుగడ్డ

కథ 18

లోకం తీరు

ఆరోగ్యం ... 17
అవీ... ఇవీ ... 21
మనసా... తెలుసా ... 22
విజ్ఞానవీచిక ... 23
కొత్త పుస్తకాలు ... 24



హిజ్బొల్లా...

స్నేహ 6-8-2006 నాటి అనుబంధలో అట్టమీది కథ 'బలిపీఠం పై లెబనాన్' ఆసక్తికరంగా ఉంది. హిజ్బొల్లా అంటే దేవుడిపక్షం అని తెలుసుకున్నాం. టర్నింగ్‌పాయింట్‌లో మేథోసంపన్నుడు 'బ్యారేజీల కాటన్' గురించిన విషయాలందుకున్నాం. సెన్సు కామన్‌సెన్సు, సమీక్షణం శీర్షికలు ఆకట్టుకున్నాయి. 'అవి ఇవీ'లో కార్టూన్లు ప్రవేశపెట్టడం బావుంది. అతిథిగా మాముందుకొచ్చిన డబ్ల్యూ సీతారంగారన్నట్లు వైద్యులకు సమయపాలన అవసరమన్నది అందరూ ఏకీభవించాల్సిన విషయం. 'ఇలా ఉందామా'లో రతన్ గారి 'ఆదర్శం'స్కెచ్‌లో చెప్పినట్లు నిజాయితీగా ఉండేవారున్నారు. ఉన్నతులను ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మిగతా అన్నీ అంశాలూ బావున్నాయి. అభినందనలతో...

నేమాన సుభాష్ చంద్రబోస్, ఇలిసిపురం, శ్రీకాకుళం



జాషువా

ప్రతి ఆదివారమూ మీరందించే స్నేహ అంటే నాకు చాలా ఇష్టం. కలం స్నేహం ద్వారా అందరినీ పరిచయం చేస్తూ వారి ఫోటోలతో సహా ఇస్తున్నందుకు ధన్యవాదాలు. టర్నింగ్‌పాయింట్‌లో జాషువాగురించి ఇచ్చినందుకు గాను నేను చాలా ఇష్టంగా చదివాను. సెంటర్‌పేజీ కలర్‌ఫుల్‌గా ఇస్తే బాగుంటుంది, ఆలోచించండి. స్నేహ ఇంకా మంచి మంచి శీర్షికలతో సాగాలని ఆకాంక్షిస్తూ...

యం. సంతోష్ నాయక్,
రాజానాయక్ తండ, జెపిఎమ్

సృష్టించాలి...

నాటకం వినోదం కాదు! నాటకం విజ్ఞానాన్ని మానవ సమాజ వికాసాన్నీ కలిగించాలి! పూర్వం సాంఘిక నాటకాల రచయితలు, వాటిలోని పాత్రలను ఎంతో ముందుచూపుతో ఆలోచించి ప్రవేశపెట్టేవారు. ఈవారం 'సమీక్షణం' శీర్షిక ద్వారా ప్రచురించిన వ్యాసంలో రచయిత పేర్కొన విశ్లేషణ అక్షరాలా నిజం! కొన్ని నాటకాలను నెలల తరబడి విదేశాల్లో ప్రదర్శిస్తున్నారు. ఈ విషయాలు ప్రముఖ నాటక రచయిత, నటుడు గొల్లపూడి మారుతీరావు గతంలో వివరించారు. ప్రస్తుత ప్రపంచంలో నాటకాల తీరులో కొన్ని సరికొత్త మార్పులు రావాలి. సమాజంలో మానవ బలహీనతలు బయటపెట్టే పాత్రలను రచయితలు సృష్టించాలి. విలువలున్న గత నాటకాలను ఆదర్శంగా భావించాలి.

జె. సుధాకారరావు, వీధినాటక కళాకారుడు, కాకినాడ

మహోన్నతులు

కాటన్ మహాశయుల వంటి మహోన్నతులు కోట్ల జనాభాలో కొద్దిమంది ఉన్నా చాలు. పోతే సినిమా కబుర్లు ఆహ్లాదకరంగా ఉంటున్నాయి. శాంతి ఉద్యమంద్వారా లెబనాన్ యుద్ధం ఆగుతుందా? మంచి చెట్నీతో ఊతప్పం బాగుంటుంది, నిజం! రంగనాథ్ ఇంటర్వ్యూ బాగుంది. కథలు సాధారణంగా ఉంటున్నాయి. బలిపీఠం ముఖచిత్రం ఆందోళనను చక్కగా వ్యక్తం చేసింది. కార్టూన్లు సింపుల్‌గా ఉంటున్నాయి. మొత్తంగా ప్రజాశక్తి ప్రజల జీవన విధానానికి దర్పణం పడుతోంది.

వాస్తు రామచంద్ర,
రాంజీనగర్, నెల్లూరు.

పురోగతి

'ఇలా ఉందామా' శీర్షిక ఎంతో బావుంది. నేటి యువత బాధ్యత నెరిగి అభ్యుదయమార్గాన ఎలా పయనించాలో, ఉన్నత లక్ష్యసాధనకు ఎలా కృషిచేయాలో తెలిపారు. ఉన్నతులను చూసి ఎలా ఉండాలో నేర్చుకోవాలని చక్కటి భావాలను మనసుకు హత్తుకునేలా చెప్పారు. 'రుచి' శీర్షిక నోరూరించేలా ఉంది.

అన్నే వెంకటకృష్ణారావు,
గన్నవరం

అభివృద్ధి

'మనసాతెలుసా' చాలా ఉపయోగకరంగా ఉంది. దీన్ని చదివి మేం మా పర్సనాలిటీని అభివృద్ధి చేసుకోగలుగుతున్నాం. 'అవీ...ఇవీ' శీర్షికలో 'ఒరే తమ్ముడూ' కవిత కంటతడి పెట్టించింది. పుస్తక పరిచయం ద్వారా కొత్త కొత్త పుస్తకాలను పరిచయం చేస్తున్నారు. రుచిలో అందించే వంటకాలు బాగున్నాయి.

లక్ష్మి, బాలాజీ కాలని, తిరుపతి.

అభిరుచి

'రుచి'లో మీరందిస్తున్న వంటలన్నీ బాగుంటున్నాయి. 'కలంస్నేహం' ద్వారా ఉత్తరాలు రాసే అభిరుచిని ప్రోత్సహిస్తున్నారు. 'కవర్ పేజీ' చాలా బాగుంది. 'హేపీ బర్త్‌డే' శీర్షిక ద్వారా పిల్లలకు ఉచితంగా పుట్టినరోజు శుభాకాంక్షలందిస్తున్నందుకు కృతజ్ఞతలు.

శిరీష,
తెనాలి.

అలరిస్తోంది

స్నేహ మమ్మల్ని ఎంతగానో ఆకట్టుకుంది. ముఖ్యంగా క్యాంపస్‌ఛాట్ బాగా అలరిస్తోంది. మా స్నేహితులమంతా కలిసి ఈ శీర్షికను చదువుతున్నాం. రుచిలోని వంటకాలు బాగుంటున్నాయి. జోక్స్ మమ్మల్ని నవ్వులతో ముంచెత్తుతున్నాయి.

జె. శ్రావణి, కొత్తగూడెం

రూ.510/-ల ఇంగ్లీష్ కోర్సు రూ.150/-కే

లేటెస్ట్ టెక్నాలజీ సహాయంతో



మొత్తం మూడు డివిజన్ల ప్రత్యేక ఇంగ్లీష్ కోర్స్

డివిజన్-1	డివిజన్-2	డివిజన్-3	
రూ.130/-	రూ.170/-	రూ.210/-	రూ.510/-

డివిజన్-1 ABCD ల నుంచి ఇంగ్లీష్ చదవటం, రాయటం, నేర్పుతూ, ప్రతి ఒక్కరికీ కావలసిన స్థాయిలో స్టాండర్డ్ ఇంగ్లీష్ నేర్పబడుతుంది. ఈ కోర్స్ ఫీజు రూ.130/-

డివిజన్-2 తప్పులు లేకుండా ఇంగ్లీషు రాయుటకు కావలసిన ఆంగ్ల వ్యాకరణం పరిపూర్ణంగా సులభ సూత్రాలతో చాలా ఈజీగా నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.170/-

డివిజన్-3 ఎంతో సులభంగా, ఏ సందర్భంలోనైనా తడబడకుండా, తప్పులు లేకుండా, మంచి నీళ్ళు తాగుతున్నట్లుగా మంచి ఇంగ్లీషు మాట్లాడటం నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.210/-

రూ.150/-కే

ఇవన్నీ!

ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!...

నేను ఒకసారి రైలులో ప్రయాణిస్తున్నాను. నా ప్రక్క సీటులోని వ్యక్తి స్టూడెంట్స్ ఇంగ్లీష్ ఇన్స్టిట్యూట్ వారి పుస్తకాలు చదువుతున్నాడు. నేనూ టైంపాస్ కొరకు ఒక బుక్ తీసుకొని చదివాను. అంతే! నాకు ఆశ్చర్యంవేసింది. "ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!..." అనిపించింది. నేనూ పుస్తకాలు తెప్పించుకుని చదివి ప్రస్తుతం నేను చక్కగా ఇంగ్లీష్‌లో మాట్లాడుతున్నాను.

- కె.కమలాకరరావు, విజయవాడ.

ఇదొక డిఫరెంట్ కోర్స్!

డిగ్రీవరకు చదివిన నేను ఇంగ్లీష్‌లో మాట్లాడలేకపోయేవాడిని, నా మిత్రుని వద్ద ఈకోర్స్ బుక్స్ చూశాను. ఇంగ్లీష్ ఫ్లూయెన్సీకి కరక్ట్‌గా ఉపయోగపడే బుక్స్ యివి. 'ఇదొక డిఫరెంట్ కోర్స్' అని నాకు అనిపించింది.

- వి.కె. రాజు, రాజమండ్రి.

కోర్స్ అద్భుతంగా ఉంది!

అవును! ఈ ఇంగ్లీష్ కోర్స్ చాలా అద్భుతంగావుంది. ఎందుకంటే, బాగా చదివినవారికే కాక, కొద్దిగా చదువుకున్న వారికి కూడా అర్థమయ్యేరీతిలో చెప్పిన విధానం చాలా బాగుంది.

-కె.సురేష్, హైదరాబాద్.

ఎక్కడా చూడలేదు

నేను డిగ్రీ వరకూ చదివాను. అయినా ఇంగ్లీష్ మాట్లాడలేక పోయేవాడిని. సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోండి అని ప్రకటన చూసి కోర్స్ కొన్నాను. నిజానికి నేను ఇలాంటి కోర్స్ బుక్స్ ఎక్కడా చూడలేదు.

- వై.చంద్రశేఖర్, విశాఖపట్నం.

సులభంగా వుంది

చాలా పుస్తకాలు చూశాను. ఇంగ్లీష్ నేర్పే విధానం ఆ పుస్తకాల్లో అర్థమయ్యేది కాదు నాకు, ఈ కోర్స్ కొని చదువుతుంటే, ఇంగ్లీష్ ఇంత సులభమా అనిపించేంతగా వుంది. చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకొన్నాను.

- జె.శ్రీనివాసులు, తిరుపతి.

STUDENTS' ENGLISH INSTITUTE

3730

POST BAG NO.8569, New No. 203, Habibullah Road,
(Near: KodambakkamRly. Stn;) T.Nagar, Chennai - 17.

నాకు ప్రస్తుతం రూ.510/-లు విలువగలిగిన ఇంగ్లీష్ కోర్సు కేవలం రూ.150/- లకే వి.పి.పి. ద్వారా పంపించండి. పోస్ట్‌మేన్‌కి పైకం చెల్లించి ప్యాకెట్‌ని తీసుకుంటానని హామీ ఇస్తున్నాను.

Name: ....

Address: ....

....

....

....

.... Pincode

టర్నింగ్ పాయింట్

రుక్మిణి

వాళ్లతో హిట్లర్ కరచాలనం చేసి భార్యతో తన గదిలోకి వెళ్ళి దఢాల్న తలుపులు వేశాడు. నిమిషం తర్వాత పిస్తోలుపేలిన శబ్దం! అది ఫాసిస్టు నాజీ ఫుమరర్ రీచ్‌కు అంతం!



నాజీ నియంత చివరిరోజు

రెండో ప్రపంచ యుద్ధం. యావత్ ప్రపంచానికదో పీడకల. నాజీ నియంత (ఫుమరర్) హిట్లర్ యూదుల నిర్మూలన పేరిట సాగించిన నరమేథం ప్రపంచంలోని అన్ని దేశాలనూ బీభత్సానికి గురిచేసింది. శుద్ధ ఆర్యరక్తం పేరిట సాగించిన ఈ మానవ హననం అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. కాకి కూడా కలకాలం బతకదు గదా. దానికీ నూకలు చెల్లుతాయి. అదే నాజీ నియంత హిట్లర్ విషయంలోనూ సంభవించింది. 1945 ఏప్రిల్ 30నాడు ఈ ప్రపంచానికే పట్టిన పీడ వదిలిపోయింది. ప్రపంచ చరిత్రలో అదో పెద్ద టర్నింగ్‌పాయింట్. ఆనాడు హిట్లర్ చరిత్ర పరిసమాప్తం కాకుంటే ఇంకా ఎన్ని లక్షలమంది ప్రజలు తమ అస్థిత్వాన్ని, సర్వస్వాన్ని కోల్పోవలసి వచ్చేదో?!

ఈ విషయంపై సంయుక్త దళాల ఇంటలిజెన్సు 1945లో ఎంక్వైరీకి ఆదేశించింది. కుప్పలు తెప్పలుగా పత్రాలు పరిశీలించారు. తర్వాత జరిగిన వాస్తవాలు ఒకటొకటిగా వెలుగులోకొచ్చాయి.

1945 ఏప్రిల్ 30 మధ్యాహ్నం సరిగ్గా 2.30లకు తన భూగర్భ నివాసం (ఫుహరర్ బంకర్) వాల్తర్ ఆటోమాటిక్ రివాల్వర్‌ను నోట్లో ఉంచుకుని హిట్లర్ ట్రిగ్గర్ నొక్కాడు. పక్కనే కూర్చుని ఉన్న అతని భార్య ఈవా సైనైడ్ కాప్సూల్‌ను కొరికింది. రాత్రి 10.30లకు వాళ్ల మృతదేహాలను పెట్రోలుతో తడిపారు. ఛాన్సలరీ గార్డెన్‌లో వాటికి నిప్పంటించగా భగ్గున మండిపోయాయి. రాత్రంతా రష్యన్ దళాలు శవాలకోసం గాలించాయి. మాడిపోయిన హిట్లర్ ఎముకలు కనిపించాయి.

ఈ అంతానికి ఆరంభం ఆ నాజీనియంత జన్మదినం రోజున 20 ఏప్రిల్ 1945లో ప్రారంభమైంది. ఛాన్సలర్ గార్డెన్ కింద యాభై అడుగుల లోతున ఈ స్థావరంలో జర్మనీ యుద్ధ అధికారులు, నాజీ పార్టీ ప్రముఖులూ శుభాకాంక్షలు తెలపడానికి హాజరయ్యారు. అటు అన్నివైపులా నాజీ దళాలు దారుణంగా సంయుక్త దళాల చేతిలో దెబ్బతింటున్నాయి. ఆ విషయం చెప్పబోయిన సైనికాధికారిపై "నాన్సెన్స్... రష్యన్లు ఓడిపోతున్నారు. బెర్లిన్ గేటు వరకు కూడా రాలేరు. తర్వాత వాళ్లను మనం వెనక్కు నెట్టి సముద్రంలో కలిపేద్దాం!" అని విరుచుకుపడ్డాడు హిట్లర్.

"కానీ, మనం వెనక్కి తగ్గితే మంచి"దని సూచించాడు, గోయరింగ్.

హిట్లర్ మండిపడి "అంత ప్రాణభయం ఉంటే నువ్వు సురక్షిత ప్రాంతానికి పారిపో!" అన్నాడు.

గోయరింగ్ వెంటనే అంతులేని సంపదతో మెర్సిడెస్ కారులో బవేరియాకు వెళ్లిపోయాడు.

ఆ స్థావరంలో ఆయుధశాఖ మంత్రి అల్బర్ట్ స్పీర్ ప్రజా సంక్షేమాన్ని పట్టించుకునేవాడు. హిట్లర్ చేసిన అతి భయానకమైన ప్రణాళికను పసికట్టాడు. సంయుక్త దళాలు జొరబడగానే పారిశ్రామిక కేంద్రాలనూ, గనులనూ, ప్రజాసౌకర్యాలనూ, ఆహారనిల్వలనూ, వస్త్రనిల్వలనూ తక్షణమే ధ్వంసం చేసిపారేయాలంటూ హిట్లర్ నాజీ జిల్లా యూనిట్లన్నింటికీ ఆదేశాలు జారీచేశాడు. ముఖ్యమైన బ్రిడ్జిలను, రైల్వేలైన్లను, ఓడలను ప్రజలకు ఉపయోగపడే ఏ రకమైన సౌకర్యాలనైనా ధ్వంసం చేసేయాలని ఈ మహా ఫాసిస్టు నాజీ నియంత ఆదేశించాడు. అయితే స్పీర్ సుడిగాలిలా మొత్తం దేశాన్ని చుట్టి, ఈ ఆదేశాలు అమలు కాకుండా సైనికాధికారులను ఒప్పించగలిగాడు.

ఏప్రిల్ 22 నాడు రష్యా దళాలు అండర్‌గ్రౌండు రైలు మార్గం గుండా బెర్లిన్‌లో ప్రవేశిస్తాయని తెలిసి 'ఆ సొరంగం నిండా నీళ్లు వదలండి' అన్నాడు హిట్లర్.

"కాని ఫుమరర్... దాన్లో గాయపడిన మన వేలాదిమంది సైనికులున్నారు.. ఎట్లా?" అని జనరల్ కేబ్స్ అభ్యంతర పెట్టాడు.

"నీళ్లు వదలండీ!" హిట్లర్ భయంకరంగా కేకపెట్టాడు. అంతే... నీళ్లు వదిలారు.

29 ఏప్రిల్... అంతా హడావిడి. ఆరోజు ఉదయం హిట్లర్ నిరడంబరంగా పెళ్ళిచేసుకున్నాడు. బయట రష్యన్ దళాలు ఫిరంగి గుండ్లు పేలుస్తున్నాయి. తన వారసుడిగా కార్లడోనిట్జను నియమించాడు హిట్లర్.

అప్పుడే... ముసోలినీ, క్లారా పెట్టాక్సిలు పట్టుబడ్డారనీ, వారిని బహిరంగంగా కాల్చిచంపారనీ, మిలన్ (ఇటలీ) చౌరాస్తాలో ప్రజల సందర్శనార్థం ఆ శవాలను తలకిందులుగా వేలాడదీశారనీ ఓ వార్త వెలువడింది. హిట్లర్ "నా భార్య శరీరాన్ని, నా శరీరాన్ని పూర్తిగా సర్వనాశనం చేయాలి... పూర్తిగా! వాళ్లు నన్ను ఎన్నటికీ సజీవంగా పట్టుకోవడానికి వీల్లేదు" అని పిచ్చి పట్టినవాడిలా కేకలు పెట్టాడు.

ఆ రాత్రి హిట్లర్ ముఖ్యులందరితో కరచాలనం చేశాడు. లోపల క్యాంటీన్‌లో ఒక ఉన్మాదకర వాతావరణం నెలకొంది. విస్కీ బ్రాందీ వరదలై పారాయి. కొందరు వెర్రెత్తినట్లు డాన్సులు చేశారు. ప్రాతఃకాలం వరకూ చిందులువేశారు.

"నిశ్శబ్దం" అని ఫుహరర్ ఎన్నిసార్లు అరిచినా ఎవరూ పట్టించుకోలేదు.

30నాడు ఉదయాన మామూలుగా, సంతృప్తిగా ఆహారం తీసుకున్నారు. బయట బోర్మన్ గోబెల్సులు వేచియున్నారు. వాళ్లతో హిట్లర్ కరచాలనం చేసి భార్యతో తన గదిలోకి వెళ్ళి దఢాల్న తలుపులు వేశాడు. నిమిషం తర్వాత పిస్తోలుపేలిన శబ్దం!

అది ఫాసిస్టు నాజీ ఫుమరర్ రీచ్‌కు అంతం!

❖

ఎంతగానో చెప్పాను... అయినా వినిపించుకోలేదు

గతంలో నా చెడు స్నేహాల వల్ల పోలీసువారు నాపై 'రౌడీ షీట్' ఓపెన్ చేసారు. ప్రస్తుతం నేను ఓ ప్రయివేటు కంపెనీలో పనిచేస్తున్నాను. అది హైదరాబాదు నగరానికి దూరంగా ఉంది. ఆ నగర శివార్లలో ఎటువంటి అల్లర్లు జరిగినా పోలీసు వారు నన్ను అనుమానిస్తున్నారు. పోలీస్టేషన్‌కు పిలిపించి నన్ను అవమానిస్తున్నారు. ఆ అల్లర్లలో నా ప్రమేయం లేదని ఎంత చెప్పినా వారు వినిపించుకోవట్లేదు. ఇలా పోలీసుల చుట్టూ తిరుగుతూ డ్యూటీకి ఎగనామం పెడుతున్నందుకు మా యాజమాన్యం నన్ను ఉద్యోగంలోంచి తొలగించే ప్రమాదముంది. కాని ఈ విషయం వారికి చెప్పలేను. నేనేం చేయాలో అర్థం కావటంలేదు. సలహా ఇవ్వగలరు.

నవీన్, హైదరాబాద్

మీకు గతంలో ఉన్న నేర చరిత్ర ప్రకారం మీపై 'రౌడీషీట్' ఓపెన్ చేశారు. మీరు ఎటువంటి నేరంలోనూ ఒక సంవత్సరం పాల్గొన కూడదు. ఏ పోలీస్టేషన్లోనైనా ఎటువంటి నేరమూ మోపబడనట్లయితే మీమీద రౌడీషీట్ సంవత్సరం తర్వాత తీసివేస్తారు. అలా తీసివేయనట్లయితే మీరు హైకోర్టులో రిట్ వేయండి. మీ నిర్దోషిత్వం రుజువుచేసుకుంటే మీపై రౌడీషీట్ ఎత్తివేయించవచ్చు.

జి.ఎల్.నరసింహారావు
హైకోర్టు న్యాయవాది

డబ్బు తీసుకున్నారని తెలిసింది....

మా గ్రామంలో గతంలో ఉన్న 15 అడుగుల కాలువపై బ్రిడ్జిని కొందరు ఆక్రమించారు. దాన్ని మూడు అడుగుల వరకు కుదించారు. మా గ్రామ సర్పంచ్ మొదలగువారు ఈ చర్యను ప్రోత్సహించారు. వారు డబ్బులు తీసుకున్నారని మాకు తెలిసింది. అటువంటి వారినెలా ఎదుర్కోవాలి? నివారించలేమా?

మురళి, వరంగల్

మీరు ఈ విషయాన్ని మీ పంచాయితి రాజ్ అధిపతి అంటే డి.ఎల్.పి.ఓ. లేదా డిస్ట్రిక్ పంచాయితీ అధికారి దృష్టికి తీసుకురండి. వారు తప్పకుండా చర్య తీసుకుంటారు. అట్టివాటిని వారి దృష్టికి తేవడం ద్వారా వీరి చర్యలను నివారించవచ్చు. వారు సరియైన చర్యలు తీసుకోనట్లయితే హైకోర్టులో రిట్ వేసి తగు చర్యలు తీసుకునే విధంగా వత్తిడి తీసుకురావచ్చు.

పాఠకులకు మనవి

మీకు లేదా మీవాళ్ళకు న్యాయ సంబంధమైన ఇబ్బందులేమైనా తలెత్తాయా? ఏం చేయాలో పాలుపోక సతమతమవుతున్నారా? అయితే వెంటనే ఆ సమస్యేంటో మాకు తెలియజేయండి. న్యాయవాది శ్రీ జి.ఎల్. జి.ఎల్.నరసింహారావు తగిన పరిష్కారాన్ని తెలియజేస్తారు. మా చిరునామా: ప్రజాశక్తి ఆదివారం అనుబంధం, ఫ్లాట్ నెంబర్: 1, అశోక్ నగర్, హైదరాబాద్ - 500 020.





ఇంటి సంగతులు

ఎ. జ్యోతి

ఆసక్తి - ప్రోత్సాహం



"ఒరేయ్, వసూ! ఏమిట్రా ఈ మార్కులు? ఇలాగేనా చదివి ఏడ్చేది?" అంటూ కొడుకు ప్రొగ్రెస్ కార్డు చూస్తూ కోపంగా తిట్టాడు శ్యామ్.

"డాడీ, టీచరే సరిగ్గా మార్కులు వేయలేదు. నేను బానే రాశాను" నేలచూపులు చూస్తూ చెప్పాడు వసు.

"ఇది బావుందిరా... నీకు మార్కులు రాకపోవడానికి కారణం టీచరంటావా? అసలీమధ్య ఇంట్లో పుస్తకం తీసి చదువుతున్నావా? బ్యాగ్ మోసుకుంటూ స్కూలుకెళ్లడం, ఇంటికి రాగానే దాన్ని ఓ మూలకు గిరాటేయడం, అమ్మ పెట్టే టిఫిన్ శుభ్రంగా తినడం, టీవీ ముందు కూర్చుని ఏ వెధవ ప్రోగ్రామ్సో చూడడం లేదంటే కంప్యూటర్‌లో గేమ్స్ ఆడడం, మళ్లీ రాత్రి భోజనం చేసి పడుకోవడం...."

"ఏమిట్రా, శ్యామ్! కొడుకును చడామడా తిట్టేస్తున్నావ్?" అంటూ వచ్చాడు అతని కొలీగ్ కృష్ణ.

"ఏం చెప్పమంటావురా కృష్ణా... మా వాడి చదువు గురించే నా దిగులు. ఈ ప్రొగ్రెస్ కార్డు చూడు. మార్కులెలా ఉన్నాయో" అంటూ కృష్ణ చేతికిచ్చాడు శ్యామ్.

"సరేలే ఇప్పుడు తిడితే మార్కులొస్తాయా. అయినా స్కూల్‌లో టీచర్లుచెప్పినంత మాత్రాన పిల్లలకు మార్కులు రావాలనుకుంటే ఎలారా? నువ్వు దగ్గరుండి వాణ్ని కాసేపు శ్రద్ధగా చదివించు. ఫలితం కనబడుతుందో లేదో అప్పుడు చూడు"

"ఇహ ఈ రోజునుండీ సాయంత్రాలు బయటికెళ్లడం మానేస్తాను. మా వాణ్ని దగ్గరుండి చదివిస్తాను" అన్నాడు శ్యామ్

అవును. పిల్లలు కొంత పెరిగేంతవరకు వారి చదువుపట్ల పెద్దవాళ్ల బాధ్యత తప్పనిసరి. కొందరు పిల్లలు స్కూల్లో చెప్పినదాన్ని వింటారు. ఇంట్లో పెద్దగా చదవరు. అయినా మంచి మార్కులు తెచ్చుకుంటారు. మరికొందరు పిల్లలకు స్కూల్లో విన్నా, మళ్లీ ఇంట్లో చదివితేనేగానీ బుర్రకెక్కదు. ఇది వారి తెలివితేటలపై ఆధారపడి ఉంటుంది. కొందరు పిల్లలు వయసుకు తగినట్లు మానసికంగా ఎదగకపోవచ్చు. వీరికి ఒకసారి వినగానే రాకపోవచ్చు. వీరిని ఇంటివద్ద కూర్చోబెట్టి స్కూల్లో చెప్పిన పాఠాలను వల్లెవేయించాలి.

స్కూలునుండి రాగానే 'చదువు... చదువు' అంటూ కట్టి పడేయకుండా కాసేపు అలా స్వేచ్ఛగా వదిలేయాలి. ఆ తరువాత స్కూల్లో ఆ రోజు చెప్పిన పాఠాలను చదివించాలి. ఇలా రోజూ ఒక క్రమ పద్ధతి వారికి అలవాటు చేయాలి. కొద్దిరోజులకు వాళ్ళంతట వాళ్ళే చదువుకుంటారు.

ఇంట్లో తల్లిదండ్రులు చెప్పలేక పోయినప్పుడు బయటెవరైనా బాగా చెప్పే ట్యూషన్ మాష్టర్‌లవద్దకు పంపించాలి. చిన్నప్పటినుంచీ చదువుపట్ల శ్రద్ధకలిగేలా చేయాలి. "మొక్కయి వంగనిది మానై వంగునా" అన్న సామెత ఉండనే ఉంది. అందుకే చిన్నప్పటినుంచే వారికి ఆసక్తి కలిగేలాచేయాలి. బాగా చదువుకుని, ఉన్నత స్థాయిలో ఉన్నవారి గురించి వారికి తెలియజేయాలి. బంధువుల్లో బాగా చదివిన వారెవరైనా ఉంటే "అదిగో ఆ మావయ్య చూడు ఎంత పెద్ద ఉద్యోగం చేస్తున్నాడో. మరి నువ్వూ అలా చేయాలంటే బాగా కష్టపడి చదవాలి" అని వాళ్లకు చదువు విలువ తెలిసే విధంగా వివరంగా చెప్పాలి.

కొందరికి చదువుపట్ల ఆసక్తి తక్కువగా ఉండి ఆటలమీద ఇష్టం ఉండొచ్చు. అలాంటి వారికి ఆటలనూ నేర్పించాలి. ఆడించాలి. ఈ రోజుల్లో ఒక్క చదువేకాకుండా మిగతా కార్యకలాపాలూ ముఖ్యమే. అందుకని వారి ఆసక్తిని గ్రహించి ఏదిష్టమో అది వారికందేలా చూడాలి. సహకరించాలి. ప్రోత్సహించాలి.

ఇలా చేయడంవల్ల పిల్లలు మానసికమైన వత్తిడి లేకుండా ఆనందం పొందుతారు. చదువుపట్ల శ్రద్ధ కనబరుస్తారు.

పూర్వం ఏదైనా నేర్చుకోవాలన్నా, నేర్పించాలన్నా అందరికీ అన్నీ అందుబాటులో ఉండేవి కాదు. ఇవాళ దాదాపుగా అంతటా అన్నీ నేర్చుకునే అవకాశం ఉందనే చెప్పాలి. అవకాశమున్నంతలో పిల్లలకి ఇష్టమైనదేదైనా నేర్పించడం, వారి మనసెరిగి నడిపించడం తల్లిదండ్రుల బాధ్యత. దీన్ని విస్మరించకూడదు.

ఇలా వుందామా...

వి. నాగరత్న



బద్ధకిస్టు

చెప్పిందేదీ సరిగ్గా చదువుకురాని శిష్యుల్ని చూసి నిట్టూరుస్తూ "ఇతర కారణాల సంగతలా వుంచి బద్ధకించి చదవనివాళ్ళెవరో నిజాయితీగా చేతులెత్తండిరా" అన్నారో గురువుగారు.

పదిమంది సిన్సియర్‌గా చేతులెత్తారు.

నిమ్మకు నీరెత్తినట్లు వెనక్కి సాగిలబడి కూర్చున్న అరుణాచలానికేసి చూస్తూ "ఏంట్రా చలం, సోమరితనంలో అందెవేసిన చేయి నీది, అలాంటిది నువ్వు చెయ్యెత్తలేదే?" అన్నారు గురువుగారు.

"ఎత్తడానికి బద్ధకమేసిందండీ" అన్నాడా శిష్యోత్తముడు.

* * *

అదన్నమాట సంగతి. దాన్నేం కేవలం హాస్యంకింద కొట్టిపారేయక్కర్లేదు. మనలో చాలామందిమి అరుణాచలంతోనో, కాదంటే తక్కిన పదిమంది సోమరిగణంతోనో పోల్చదగినవాళ్ళమై వుంటాం.

నా మట్టుకు నాగురించే చెప్తాను. కేగారు ఈమధ్యకాలంలో పన్నెండుత్తరాలైనా రాసుంటారు. ఒక్కదానికి సమాధానమిస్తే ఒట్టు. ఇంకా దుర్మార్గమేంటంటే రిప్లయ్ ఇవ్వకుండానే ఇంకో లెటర్ రావాలని చూస్తుంటాను. రాయడానికి బోల్డన్ని విషయాలున్నాయి. ముఖ్యంగా అంత ఆత్మీయంగా వుండే రచయితమిత్రులు చాలా అరుదు. లేనిపోని ఈర్ష్యాద్వేషాలూ, నాన్సెన్సూ మచ్చుకైనా కనిపించని పెద్దమనిషి. రాయాలనే అనుకుంటాను, కానీ కాగితం తీయాలంటే ఒళ్ళుబద్ధకం. అథవా రాసినా, పోస్టాఫీసుకి వెళ్ళి లాంఛనంగా కవర్లోపెట్టి పోస్టుచేసేందుకు ఒళ్ళొంగదు. ఆ లేఖారాజం నా బ్యాగులోనే పదిలంగా వుంటుంది. ఎన్నాళ్ళో ఇంటికీ, ఆఫీసుకీ ఎడతెరపి లేకుండా ప్రయాణాలు చేసి, కుంగికృశించిపోయి జీర్ణావస్థకు చేరుతుంది. ఇక దాన్ని చూస్తే నాకే రోతపుట్టి చింపి బుట్టదాఖలు చేసిన సందర్భాలూ వున్నాయి.

నా సోమరితనంగురించి అంతగా తెలీని కేగారు 'పోస్టల్‌వాళ్ళ నిర్లక్ష్యానికి హద్దు లేకుండాపోయింది. మీరు మూడువారాల క్రితం రాసినుత్తరం ఇవాళే అందింది' అని రాసిన సందర్భాలూ వున్నాయి. ఫోన్ చేసినపుడు మాత్రం "నిజ్జంగా సారీ, అస్సలు టైముండటంలేదు.. క్షణం తీరికా లేదు, దమ్మిడీ ఆదాయమూ లేదన్నట్లుంది నా పని' అంటూ బుకాయించేస్తాను. ఇదే మాట ఇంకొకళ్ళు నాతో అంటే మాత్రం 'ఔనౌను రాజ్‌శేఖర్రెడ్డికైనా తీరుతుందిగానీ పాపం నీకెక్కడ కుదుర్తుందిలే' అని చురకలంటిస్తాను. ఇంతకీ జవాబు రాయకపోవడంలో కళ్ళు నెత్తికెక్కడమనే ప్రశ్నే లేదు కాబట్టి ఆ స్నేహమలా నిలిచుంది.

* * *

హ్యాండ్‌బ్యాగ్ కొనుక్కోవాలని నెలరోజులుగా అనుకుంటున్నాను. ఏరోజుకారోజు 'లేఖమ్మ ఎదురుచూస్తుంటుంది', 'నడుంనొప్పిగా వుంది', 'డైరెక్ట్ బస్ దొరికింది' లాంటి సాకుల్తో 'అమ్మో ఇవాళ కాదులే, రేపు కొనొచ్చులే' అని పొడిగించేస్తున్నాను. రోజూ చూసేవాళ్ళతో ఏమీ అనిపించదుగానీ, ఎవరైనా కొత్తవాళ్ళు కలిసినపుడు మాత్రం మంచి బ్యాగ్ లేనందుకు వగచి 'గంటలో అయ్యేపనికి ఇంత పోస్ట్‌పోన్‌మెంటేమిటి?' అని నన్ను నేనే తిట్టుకుంటాను.

* * *

'ఆ కొన్ని పనులలా నడుస్తాయి గనుక వాయిదాలు వేస్తాంగానీ ముఖ్యమైనవన్నీ చేసుకోవడంలేదా?' అని సమర్థించుకోను. ఎందుకంటే ఇతర్లను మాయ చేయగలం కానీ మనల్ని మనం ఎన్నటికీ మోసం చేసుకోలేం.

అంతెందుకు, ఈ క్షణంలో ఏదో థీమ్ మనసులో మెదుల్తుంది. అప్పటికప్పుడు రాసేస్తేనే అది బాగా వస్తుంది. కొంత రాసి ఆపేస్తే ఫ్లో పోతుంది. అసలే రాయకపోతే ఊహతోనే అంతరిస్తుంది. ఎందుకంటే ఆలోచన ఎంత గొప్పదైనా ఆకారం దాల్చినపుడే దానికి విలువాచలువాను.

అందుకే కాబోలు 'నువ్వేం చేయగలవో నీకు తెలుసు. కానీ నువ్వు చేసిన పనులను బట్టి ఇతర్లు నిన్ను అంచనా వేస్తారు' అన్నారు. మనకెంత శక్తున్నా, చేయాల్సింది చేయకుండా సోమరిగా వుంటే ఎదగకపోగా నవ్వులపాలయ్యే అవకాశముంది.

అందరూ నాలా వుంటారనే అపోహ నాకెంతమాత్రంలేదు. నా లక్షణాలు మీలోనూ వుంటే మాత్రం ఒకసారి మీకు మీరే క్లాస్ తీసుకోండి. మరి బద్ధకిస్టులమైతే (బద్ధకాన్ని ఇష్టపడేవాళ్ళు) మనకే కష్టం కదండీ?!

❖

సీరియల్

గొల్లపూడి నారాయణరావు

జరిగిన కథ

(రజాకారులు ఎండుపుల్లలు పోగుచేసి, బండి కిందున్న పెద్దిరెడ్డిని బయటికి లాగి కాళ్ళూచేతులూ కట్టేసి నిప్పంటించారు. మంటల తాకిడి తట్టుకోలేక పెద్దిరెడ్డి పెడబొబ్బలు పెడ్తోంటే బడేమియా, పటేలు తిట్టసాగారు. తక్కిన రజాకారులు మంటలచుట్టూ తిరుగుతున్నారు)

(31వ భాగం)

తెలుగుగడ్డ

రెండు రోజులు గడిచిపోయాయి. ఆ రెండ్రోజులూ గ్రామంలో మానవమాత్రుడొక్కడూ కనిపించలేదు. ఊరు పాడుపడింది.

మూడవరోజు ఉదయం నుంచి ఒక్కొక్కరు గ్రామంలో ప్రవేశించసాగారు. మూదవనాటి సాయంత్రానికల్లా కోదండరాంరెడ్డి ఇంటికి చేరుకున్నాడు. మధ్యదోవలోనే, తన గ్రామాన్ని రజాకార్లు వచ్చి దోపిడీ చేసుకుని వెళ్ళారని విన్నాడు. దడదడ కొట్టుకుంటున్న గుండెలతో బావురుమంటున్న ఇంట్లోకి ప్రవేశించాడు. ఆయన్ను చూడగానే రంగనాయకమ్మ బోరుమని ఏడుపు లంకించుకుంది.

"ఇంకా ఏముందయ్యో, మన కొంపంతా దోపిడీ అయిపోయిందయ్యో" అని రాగాలు తీస్తోంది. అతడు చిత్తరువు మాదిరి నిలబడిపోయాడు. అతడి హృదయం ఇంకోవిధంగా శంకిస్తోంది. "అమ్మాయి ఎక్కడ ఉందీ?" అనడిగాడు.

అంతలోనే ఆ అలజడికి గదిలో నిద్రపోతున్న అఖిలాండం లేచి బయటికొచ్చింది. ఆమెను చూడగానే అతడు భారంగా నిట్టూర్పును వదిలాడు. కూతురి తలపై చేయివేసి నిమురుతూ "బాగానే ఉన్నావా? ఈ వార్త విన్నదగ్గరనుండి నిన్ను తలచుకుని నా గుండెలు చెదిరిపోయాయి" అన్నాడు.

రంగనాయకమ్మ ఏడుపు చాలించి భర్త దగ్గరికొచ్చింది.

"అది కొంత నయమేనయ్యా, ఇల్లంతా దోపిడీ అయిపోయినా నా తల్లిని ఆ రాక్షసులకు కనిపించకుండా రక్షించుకున్నాను. బ్రహ్మారెడ్డిగారి అమ్మాయి చచ్చిపోయింది గదా" అంది.

"సామ్రాజ్యం చచ్చిపోయిందా?" అన్నాడు ఆశ్చర్యంగా.

"ఊరికే చావలేదయ్యా, పాపం బంగారం లాంటి పిల్ల. రజాకార్ల కళ్లలో పడిందట. మొత్తం పదహారుగురు, దానిమీదబడి చెరిచారు" అంది రంగనాయకమ్మ.

"రామ రామ ఎంత మహాఘోరం జరిగిపోయింది?!" అన్నాడు కోదండారాంరెడ్డి.

"ఈ ఘోరమేమిటి? అది తల్చుకుంటే బైటవాళ్లం, మనకే గుండెలు కరిగిపోతున్నాయి. ఇక తల్లితండ్రీ ఎట్లా సహించుకున్నారో ఆ భగవంతుడికే తెలియాలి" అంది రంగనాయకమ్మ.

కోదండరామిరెడ్డి తలూపాడు. నిజమే పాపం బ్రహ్మారెడ్డికి అన్యాయమే జరిగిపోయింది. తర్వాత రెండు నిమిషాలు నిశ్శబ్దంగా గడిచిపోయాయి.

"ఇంకా ఈ హడావిడిలో మనమిక్కడ ఉండలేమయ్యా. రేపటెల్లుండిలో మా అన్నయ్య గారింటికి వెళ్లిపోదాం" అంది రంగనాయకమ్మ.

"ఈ గొడ్డూగోదా వదిలేసి ఎట్లాగే? అందులోను వరికోతకు వచ్చిందిగదా?"

"ఎట్లాగయ్యా మరీ? అమ్మాయి నొక్కదాన్నయినా పంపించిరావడం మంచిది. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే మాత్రం ఏం లాభం"

"ఆ మాట నిజమే. కాని వెళ్లదల్చుకుంటే నువ్వు, అమ్మాయి ఇద్దరూ వెళ్లండి"

"నేను వెళ్తే ఎట్లాగయ్యా? నీకు నీళ్లూ నిప్పులూ చూసి నాలుగు మెతుకులు ఉడకేసి పెట్టాలిగదా?"

"నేను ఉడకేసుకుని తినలేనంటావా?



దానికేమిటిగాని మీరు వెళ్లానంటే రేపే బండికట్టి పంపిస్తాను" అన్నాడు ఆయన.

రంగనాయకమ్మ కూతురివైపుకు చూసింది.

"ఏం అమ్మా! మావయ్యగారింటికి వెళ్దామా?" అనడిగింది.

"నాన్న నొక్కడినీ ఇక్కడ వదిలి మనం వెళ్తే నాన్న తిప్పలుపడదూ? వెళ్ళొద్దులే అమ్మా" అంది అఖిలాండం.

"మీ నాన్నతో పాటు నేనుంటాను, నువ్వైనా వెళ్లు" అంది రంగనాయకమ్మ తిరిగి.

"నేనొక్కదాన్నీ అక్కడ ఉండలేను"

"మరి ఎట్లాగే?"

"అందరమూ ఇక్కడే ఉందాములే అమ్మా, పొలంపనుల ఎద్దడి అయిపోగానే అందరమూ కలిసివెళ్దాం" అంది అఖిలాండం.

అంతలోనే ఏసురత్నం వచ్చి బయట నిలబడి "అయ్యగారూ.." అంటూ పిలిచాడు.

"వస్తున్నారా?" అంటూ కోదండరాంరెడ్డి బయటికి నడిచాడు. బయటిస్థంభాన్ని ఆనుకుని నిలబడ్డాడు ఏసు. "ఏసూ, మీవాడ విశేషాలు ఏమిటోయ్?" అనడిగాడు.

"చెట్టుకొకళ్లం, పుట్టకొకళ్లం పారిపోయాం. ఒక్కొక్కళ్లూ ఇవ్వాళే ఇళ్ళకు చేరుకుంటున్నారు" అన్నాడు ఏసురత్నం.

"మీవాడ వాళ్లకేం భయంరా పారిపోవడానికీ?"

"పటేలుగారి కోపమంతా అసలు వాడవాళ్లమీదే గదండీ"

"ఓహో, అట్లా అయితే పటేలు కూడా రజాకార్ల వెంట వచ్చాడా?"

"ఆయనేగదండీ రజాకార్లను ఉసిగొలిపి బ్రహ్మయ్యగారి కూతుర్ని మానభంగం చేయించింది. పాపం ఆ అమ్మాయిగారు చచ్చిపోయారు గదా"

"దుర్మార్గుడు, వీడికిక పుట్టగతులుండవులే" అన్నాడు కోదండరాంరెడ్డి అసహ్యించుకుంటూ. "ఇంతకూ వాడప్రజల్లో ఎవరికే ప్రమాదం లేదుగదా?" అనడిగాడు తిరిగి.

"మావాడ జనం ఒక్కడూ వాళ్లకు చిక్కలేదు. ఊరిజనం అంతా మెరకలకెక్కుతోంటే లారీలు అటువైపుకే వెళ్లినయ్. వాడజనమంతా అడవి దిక్కుకు పరారీ అయిపోయారు"

"సరే బాగానే ఉంది" అన్నాడు కోదండరాంరెడ్డి. రెండు క్షణాలు ఆగి, "మన చేలవైపు వెళ్లివచ్చావూ?" అనడిగాడు.

"చేలన్నింటినీ చూసుకునే ఇటు వస్తున్నానయ్యగారూ. చేలనిండా మోళ్లే. నిన్నమొన్న గొడ్డుబడి తెగమేసినయ్. ఊళ్లో జనమంతా పరారీ అయ్యారుగదూ. వాటికి యమరాజ్యమైంది"

"పరారీ అయినవాళ్లంతా ఇల్లుపట్టేదాకా, గొడ్లు హద్దూ అపూ లేకుండానే తిరుగుతాయి. జొన్నచేను, మిరపలకు కలిపి ఒక మనిషిని కాపలాకు ఉంచడమే మంచిదనుకుంటాను. ఎట్టాగూ మనకు వరికోతలు పట్టిన దగ్గరనుండి అటు తిరిగి చూడడానికి కూడా తీరిక ఉండదు"

"నిజమే అయ్యగారూ, వరికోతకు వచ్చింది. మనకటు పోవడానికి తీరదు"

"సరేలేరా. ఈ నెల్లాళ్లు ఒక మనిషిని కాపలాకు మాట్లాడు. తర్వాత వరికోత కూడా రేపే మొదలుపెడదామని ఉంది.. ఈ మాట వాడ జనానికి చెప్పు"

"సరేలెండి అయ్యగారూ" అంటూ తలూపాడు ఏసురత్నం.

కోదండరాంరెడ్డి లేచి నిలబడ్డాడు. "ఏమేయ్" అంటూ భార్యను పిలిచాడు. ఆపిలుపు విని లోపలనుండి వచ్చిందామె.

"నేను బ్రహ్మారెడ్డి ఇంటికెళ్లివస్తా" అన్నాడు.

"అన్నం తిని పోరాదూ? ఎప్పుడు తిని బయలుదేరావో?" అంది రంగనాయకమ్మ.

"ఇప్పుడేం అన్నం లేవే? ఊరి పరిస్థితులన్నీ వింటుంటే కడుపు తరుక్కుపోతోంది" అన్నాడు. అతడు నెమ్మదిగా బయలుదేరి సరాసరి బ్రహ్మారెడ్డి ఇంటికొచ్చాడు. ఆయనక్కడికి వెళ్లేసరికి బ్రహ్మారెడ్డి, అతడి భార్య చెరొక మంచానికి అంటిపెట్టుకుని పడుకుని ఉన్నారు. కోదండరాంరెడ్డిని చూడగానే బ్రహ్మారెడ్డి ఒక్కసారిగా లేచివచ్చి కౌగిలించుకుని పెద్దపెట్టున ఏడ్చాడు. బ్రహ్మారెడ్డి భార్య లేచి మంచందిగి నట్టింట కూర్చుంది. ఆమెకూడా సన్నగా శోకాలు ప్రారంభించింది. కోదండరాంరెడ్డి ఏడుస్తున్న భార్యాభర్తలిద్దరినీ నెమ్మదిగా సముదాయించాడు. బ్రహ్మారెడ్డిని మంచంమీద కూర్చోబెట్టి తానూ కూర్చున్నాడు.

"చూడు బ్రహ్మయ్యా, ఎవరికి ఎంత రుణమో అంత తీర్చుకుని వెళ్లిపోతారు. దానికోసం మనమింతగా ఏడ్చి మొత్తుకోవడం అనవసరం. ఏడ్చి మొత్తుకుంటే తిరిగి వస్తారుగనుకనా?" అన్నాడు.

"నిజమే అన్నయ్యా, దాని బాకీ అది తీర్చుకుని వెళ్లిపోయింది" అన్నాడు బ్రహ్మారెడ్డి నిట్టూరుస్తూ.

"దానికి భూమ్మీద నూకలు లేకపోయినాయా? బతకనందా? పాపిష్టి మూకలొచ్చి దాని ప్రాణాలు తీసుకపోయినయిగాని" అంది నర్సమ్మ. ఆమె స్వరం పూర్తిగా బొంగురుపోయింది.

"నిజమేనమ్మా, ఏ రోగమో, నెప్పో వచ్చి చనిపోతే ఇంతగా అనుకోవలసిన పనుండదు. ఇచ్చినవాడు తీసుకుపోతుంటాడు. కానీ అతడు తనమీద ఇవన్నీ పెట్టుకోడమ్మా" అన్నాడు కోదండరాంరెడ్డి.

"అంతా ఒట్టిదే అన్నయ్యా. ఉంటే నామాయ, లేకపోతే నీమాయ అనేవాళ్లే ఈ దేవుళ్లంతా. ప్రతి ఏటా కొండకుపోయి వస్తున్నాకదా. గద్దెమీదకు వచ్చి ఏది కోరుకుంటే అది కొండకు చేరమొస్తున్నా"

"కొంపలో కొత్త ధాన్యం పొంగించుకుంటే ముందుగా ఆరగింపులు పెడుతున్నాం. ఇదంతా ఎందుకు? అమ్మాయి పెళ్ళి కొండమీదనే చేస్తానని మొక్కుకున్నాం. చివరికేమయింది? అమ్మాయి లేదు, పెళ్ళీ లేదు" అన్నాడు బ్రహ్మారెడ్డి.

కోదండరాంరెడ్డి పేలవంగా నవ్వాడు. "అంతా కర్మ బ్రహ్మయ్యా. కర్మననుసరించి అంతా జరిగిపోతుంటుంది. కర్మ తప్పించుకోవడానికి భగవంతునివల్లనే కాలేదు"

"రామావతారంలో దొంగచాటున ఉండి వాలిని కొట్టిన పాపఫలితం, కృష్ణావతారంలో కట్టికుడిపింది. ఇక మన మానవమాత్రులమెంత?" అన్నాడు.

నర్సమ్మ కలిగించుకుని "నా తల్లి అట్లాంటి పాపకర్మలు ఏమీ చేసింది కూడా కాదు బావయ్యా. ఏవరయినా పిలిస్తేనే మాట్లాడేది. లేకపోతే తలొంచుకుని వెళ్లిపోయేది. అట్లాంటిదానికి ఇట్లాంటి పాడు చావు ఏమిటా అని దుగ్గ" అంది మధ్య మధ్య ఏడుస్తూ.

"ఈ జన్మలో ఏమీ చెయ్యనక్కర్లేదమ్మా. ఎప్పటిదో పూర్వజన్మ కర్మ పరిపాకమది" అన్నాడు కోదండరామిరెడ్డి.

"వెనకటి జన్మలోనూ నాతల్లి ఏ పాపమూ చేసేదికాదని నా నమ్మకం. ఇంక నా తల్లి నాకు ఎక్కడ కనిపిస్తుంది? మొండి ప్రాణాలు కాకపోతే ఇంకా మేం బతికెందుకు బావయ్యా?" అందామె.

"చూడమ్మా, చచ్చినవాళ్లతో పాటు మనమూ చావగలమా? గుండె రాయి చేసుకుని నిలబడాలిగాని" అన్నాడు కోదండరాంరెడ్డి. అంతలోనే రంగనాయకమ్మ తాంబూళం నిండా అన్నం పెట్టుకుని అక్కడికొచ్చింది.

అదిచూసి నర్సమ్మ "మళ్లీ ఈ పూటా అన్నం తీసుకొచ్చావా అక్కయ్యా?" అంది.

"ఉపవాసాలుంటారా ఏమర్రా? చచ్చినవాళ్ల కోసం ఉగ్గలుపట్టి చస్తామా ఏమిటీ?" అంది రంగనాయకమ్మ.

"ఎందుకు చస్తాం? ఈ మొండిఘటాలు ఇప్పుడే పోవు. ఈ పూట నేనే నాలుగు మెతుకులు ఉడకేద్దామని అనుకుంటూండగానే బావయ్య వచ్చాడు. అట్లాగే మాట్లాడుతూ కూర్చున్నాను" అంది నర్సమ్మ.

(ఇంకా వుంది)

క్యాంపస్ ఛాట్

కె లీల

ఆమెలా ఉంటుందో చూడాలన్న చిలిపి కోరిక... అంతే! నా బైక్ వేగాన్ని పెంచాను. కొద్దిసేపట్లో...

క్యాచ్ మి... ఇఫ్ యు కెన్

మూడు... రెండు... ఒకటి...

ఊపిరి బిగబట్టి అటువైపే చూస్తున్నారంతా... సిగ్నల్ పడిందో లేదో ఒక్కసారిగా వారి వాహనాలను ముందుకురికించారు. కొందరు రెప్పపాటులో దూసుకెళితే, మరికొందరు మామూలుగానే వెళుతున్నారు. వీరిలో మీరూ ఒకరా? మిమ్మల్నెవరైనా క్రాస్ చేశారనుకోండి... మీరెలా ఫీలవుతారు? ఏంటీ ఆలోచిస్తున్నారు? మీ అనుభవాలను నెమరువేసుకుంటున్నారు కదూ... అవి గుర్తుతెచ్చుకునే ముందు వీరి అనుభవాలేంటో తెలుసుకుందామా...

"సిగ్నల్ వైపే చూడాలా ఏంటి. నేను మాత్రం చస్తే చూడను. మరి రెడ్‌సిగ్నల్ పడిందనెలా తెలిసేది? అది తెలుసుకోవాలంటే సిగ్నల్నే చూడక్కర్లేదు. పక్కనున్న వాహనాన్ని చూస్తేసరి. అది స్పీడందుకుంటే... సిగ్నల్ పడ్డట్లే లెక్క. అరె... ఈ ఆలోచనే మాకు తట్టలేదేంటా అనుకుంటున్నారా? దటీజ్ హనీ మరి. ఓరోజు... సిగ్నల్ దగ్గర స్కూటీ ఆపాను. కొంతసేపటి తర్వాత... నా పక్కనే ఉన్న మారుతీ ముందుకెళుతోంది. అంటే... సిగ్నల్ పడిందన్నమాట అనుకుంటూ నా స్కూటీని ముందుకురికించాను. ఇంతలో సర్రుమంటూ దూసుకెళ్లాడో బైక్‌వాలా... నన్ను క్రాస్ చేసింది చాలక, వెనక్కి తిరిగి మరీ ఓ వెకిలి నవ్వు నవ్వాడు. ఇడియట్... అని తిడుతున్నారా? అలా అతణ్ణి తిట్టకండి. ఎందుకంటే ఇంతకు ముందు నేనతణ్ణి క్రాస్ చేశాను మరి. ఇప్పుడు వాడు నాపై రివెంజ్ తీర్చుకుంటున్నాడన్న మాట. చూద్దాం. ఎంత స్పీడెళతాడో... అనుకుంటూ నేనూ నా స్కూటీని ముందుకురికించాను. ఇంతలో... అతని బైక్ వేగం తగ్గింది. ఎందుకబ్బా అనుకున్నా... కాలేజీ అమ్మాయిల గుంపులుగా నడుస్తున్నారు. ఓహో... ఫిగర్స్‌ను చూస్తున్నావా నాయనా... కానియ్.. అనుకుంటూ నా స్కూటీని ముందుకురికించాను. రీర్ మిర్రర్ నుంచి వాడి ఫీలింగ్స్‌ను గమనిస్తున్నాను. అదే సమయంలో నన్ను వాడూ గమనించాడు. అప్రయత్నంగా నవ్వేశాను. ఫీలయినట్టున్నాడు. ఎంతైనా ప్రిస్టేజ్ ప్రాబ్లం కదా. మళ్లీ స్పీడందుకున్నాడు. మా ఇద్దరి బైక్‌లు పరస్పరం పోటీ పడుతున్నాయి. అతని స్పీడు 'క్యాచ్ మి... ఇఫ్ యు కెన్' అన్నట్లుంది. వామ్మో... ఏంటీ వీడింత స్పీడు పెంచేస్తున్నాడు. 'ఒరేయ్! పోతావేమో రా...' అనుకున్నాను. 'వాడు పోతే పోయాడు గానీ... ఇంతకన్నా స్పీడు వెళ్లావనుకో నువ్వు పోతావ్. జాగ్రత్త' అంతరాత్మ హెచ్చరించింది. వెంటనే నా స్కూటీ నార్మల్ స్పీడ్‌కొచ్చేసింది" అంటూ ముగించిందా అమ్మాయి. మరి ఇంజనీరింగ్ విద్యార్థి కరన్ అనుభవమేంటంటే...

"ఓరోజు... నా బైక్ ఫ్లైఓవర్ మీదుగా వెళుతోంది. నాకు కొద్దిదూరంలో స్కూటీపై వెళుతోందో అమ్మాయి. ఆమె చున్నీ గాలికి ఎగురుతూ కనిపించింది. 'ఛ... ఈ అమ్మాయిలెందుకో చున్నీ జాగ్రత్తగా ఉంచుకోరు. సినిమా హీరోయిన్లలా ఫీలవుతుంటారు కాబోలు...' అనుకున్నాను. ఆ స్కూటీకి నా బైక్‌కు మధ్య దూరం తగ్గుతోంది. ఆ అమ్మాయి కురులు అలవోకగా ఎగురుతున్నాయి. ఆమె చెవిరింగులు గమ్మత్తుగా ఊగుతున్నాయి. ఆమెలా ఉంటుందో చూడాలన్న చిలిపి కోరిక... అంతే! నా బైక్ వేగాన్ని పెంచాను. కొద్దిసేపట్లో ఆమెకు సమాంతరంగా వచ్చాను. ఆమె చాలా ఆకర్షణీయంగా ఉంది. ఆమె దృష్టిని ఆకర్షించడానికోసారి స్పీడ్‌గా వెళ్లినా... మళ్లీ స్లో చేశాను. ఎందుకంటే ఆమె నన్ను చూడాలి కదా. ఇంతలో ఆమె రయ్ మంటూ వేరే దార్లో వెళ్ళిపోయింది. షిట్... ఆమె రూట్ మా ఇంటి దార్లోనే ఉంటే ఎంత బాగుండు. అసలు ఎటువంటి అలసటా లేకుండా మా ఇల్లొచ్చేసేదిగా" అంటాడు కరన్.

అబ్బాయిలు వారి సుపీరియారిటీని ప్రదర్శించడానికే ఇలా చేస్తారంటోంది లా విద్యార్థిని వినీల. ఈమె ఇంకా ఏం చెబుతోందంటే... "నేను ఇంటర్మీడియట్ చదువుతున్నప్పట్నించి కాలేజీకి స్కూటీపైనే వెళ్లేదాన్ని. కొన్నాళ్ల తర్వాత నేను గమనించిందేంటంటే, ఏ అబ్బాయైనా మనల్ని క్రాస్ చేసేందుకు రెండు అంశాలుంటాయని. ఒకటి అమ్మాయి దృష్టిని ఆకర్షించడానికి, రెండవది ఆమెలా ఉందో తెలుసుకోవడానికి. అందరూ ఈ కోవకు చెందకపోవచ్చు కానీ నేను చూసినవారిని బట్టి ఇలా చెప్పాల్సి వస్తోంది. ఎందుకంటే... మిమ్మల్ని క్రాస్ చేసినవారిని మీరు గుర్తుపెట్టుకోగలిగితే, వారు తాత్కాలికంగా మీ ముందున్నట్లు కనిపించినా, మిమ్మల్ని దాటి వెళ్లరు. మీ కనుచూపు మేరలోనే ఉంటారు" అంటూ అబ్బాయిల సైకాలజీని వివరించడానికి ప్రయత్నిస్తోందీ అమ్మాయి.

"ఆ చౌరస్తా దగ్గర్నుంచి చూస్తున్నాను. వీడు నన్ను ఫాలో అవుతూనే ఉన్నాడు. వీడి వాలకం చూస్తుంటే ఏదోలా ఉంది. వీడిని తప్పించుకోవాలంటే ఎలా? ఆ... దీనికంతగా ఫీలవ్వాలా ఏంటి? రూట్ మార్చేస్తేపోలా... ఏ దార్లో వెళితే ఏంటి చేరేదొక్క చోటికేగా..." అనుకుంటూ రూట్ మార్చేస్తుందిట కోఠి ఉమెన్స్ కాలేజీలో చదువుతున్న ఎమ్మెస్సీ కెమిస్ట్రీ విద్యార్థిని ఖుషి.

మరి మీరే ఆ స్థానంలో ఉంటే... ❖

సినిమా కబుర్లు

చందు

తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన నటుడు **'కోట శ్రీనివాసరావు'**. ఆయన నటనా ప్రతిభకు తార్కాణంగా కొన్ని సినిమాలను ఉదహరించడం కష్టమైన పని. ఎందుకంటే అది కొండవీటి చాంతాడంత పెద్ద జాబితానే అవుతుంది. ప్రతి నాయకుడిగా మెప్పించారు. క్యారెక్టర్ నటుడిగా తనదైన శైలిని చూపారు. హాస్యరస పోషణలో ప్రత్యేకతను సాధించారు.

సినిమా ఛాన్స్ యాదృచ్ఛికం



మాది కృష్ణాజిల్లా కంకిపాడు. తల్లిదండ్రులు కోట విశాలాక్షి, సీతా రామాంజనేయులు. నేను గ్రాడ్యుయేషన్ వరకు చదివాను. 19 సంవత్సరాలపాటు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పని చేశాను. నాటక అనుభవం ఉన్నా సినిమాల్లో నటించాలన్న కోరికతో మద్రాస్ వెళ్ళి వేషాలకోసం ప్రయత్నించలేదు. స్టేట్‌బ్యాంక్‌లో ఉద్యోగమంటే ఆ రోజుల్లో మంచి ఉన్నతమైన పొజిషన్ కదా. యాదృచ్ఛికంగా సినిమా ఛాన్స్ రావడం, 'ప్రతిఘటన' సూపర్‌హిట్ కావడంతో పాపులర్ యాక్టరయ్యాను. 1982లో నేనాడిన ఓ నాటకాన్ని టి. కృష్ణగారు చూశారు. నన్ను గుర్తుపెట్టుకుని 1985లో 'వందేమాతరం' సినిమాలో అవకాశం ఇచ్చారు. దీనికి ముందు ఒకటీ అర సన్నివేశాల్లో ఓ ఐదారు సినిమాలు చేశాను. నా మొదటి చిత్రం 'ప్రాణం ఖరీదు'. అసలిది ఒక నాటిక. దీన్ని జె.ఎం.టి. కాంపిటిషన్‌లో వేసినపుడు క్రాంతికుమార్‌గారు చూశారు. వారికి నచ్చి 45 నిముషాల నాటికను రెండున్నర గంటల సినిమాగా తీర్చిదిద్దారు. నాటికలో నేను ధరించిన పాత్రను 'ప్రాణం ఖరీదు'లో రావుగోపాలరావుగారు వేశారు. నాటక రచయిత సి.ఎస్. రావుగారే సినిమాకూ రాశారు. సెంటిమెంట్‌గా నాటికలో వేసిన వాళ్ళందరితో వేషాలేయించారు. అలాగే నేను కూడా అందులో నటించాను. ఇది 1978లో విడుదలైంది. ఆ తర్వాత టి. కృష్ణగారు పిలవడం, మంచిపేరు రావడంతో ఇక నటనను వృత్తిగా ఎంచుకున్నాను.

అమితాబ్‌తో నటించడం ఆశ్చర్యం కలిగించింది

ఇష్టమైన నటనలో కెరీర్ గ్రాఫ్ పై స్థాయికి వెళ్ళడం కంటే అదృష్టం ఏముంటుంది?! తమిళంలో 15 చిత్రాలు, కన్నడలో ఆరేడు చిత్రాల్లో నటించాను. 'సర్కార్' చిత్రం ద్వారా ది గ్రేట్ అమితాబ్ బచ్చన్‌తో నటించే అవకాశమొచ్చింది. ఆ సినిమా విజయవంతమవ్వడంతో నార్త్‌లో కూడా గుర్తింపు వచ్చింది. అంత గొప్ప ఫేమస్ యాక్టర్‌తో నటిస్తుంటే 'ఇది నిజమా?' అని ఆశ్చర్యమేసింది. నాటకరంగం నుండి రావడంచేత పెద్దవాళ్ళతో నటిస్తున్నామే అన్న బెరుకు ఉండేది కాదు. ఆయన మెప్పు పొందేలా నటించగలగడం అదృష్టం.

ఇంట గెలిచి రచ్చ గెలిచా

తెలుగు ఇండస్ట్రీ మద్రాస్‌లో ఉన్నప్పుడు ఏ భాషలో అవకాశమొస్తే అందులో నటిస్తూ ఉన్న రోజుల్లో 'రండి.. హైదరాబాద్ వచ్చేయండి. తెలుగు ఇండస్ట్రీ ఇక్కడ నిలబడాలి. ఇక్కడ స్థిరపడాలి. మీరు మద్రాస్‌లో ఉండి షూటింగ్స్‌కు ఇక్కడికొస్తానంటే వేషాలివ్వం' అని అక్కడ బతుకుతున్న వాళ్ళందరినీ కావాలని ఇక్కడికి తీసుకొచ్చారు. 'తెలుగు వాళ్ళకి అది చేస్తాం... ఇది చేస్తాం...' అని ఇక్కడికి తీసుకొచ్చి తెలుగువాళ్ళను ప్రోత్సహించకపోతే ఎలా? సబ్సిడీలనేవి ఎవరికిస్తారు? వసతులకు అనువుగా ఉన్నా కూడా అభివృద్ధికి నోచుకోని వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు సబ్సిడీలివ్వాలి. డెవలప్ అయిన హైదరాబాద్‌లో స్టూడియోలు పెట్టి, రాయితీలు తీసుకుని 'ఇక్కడకు రండి... రండి' అని చెప్పి పరభాషా నటులవైపు మొగ్గుచూపుతున్నారు. మద్రాసులోనే ఉంటే నటీనటులు వాళ్ళ తిప్పలు వాళ్ళు పడేవారు.

కళలకు ఎల్లలు లేవు. పరభాషా నటుల్ని ఇక్కడకు తీసుకురాకూడదని నేను అనను. ఆంజనేయస్వామి పాత్రకు నటుడు కావాల్సివచ్చింది. ఇందుకు తగ్గట్టు శారీరక దృఢత్వం, ఇమేజ్ కావాలి. ఏ దారాసింగ్ గారబ్బాయో, అమ్రిష్‌పురిలాంటి హేమా హేమీలతో నటింపజేస్తే పరవాలేదు. ప్రత్యేక పాత్ర కోసం ఇటువంటి వారిని తీసుకొచ్చి ఉపయోగించుకుంటే తప్పులేదు. ఎవరైనా హర్షిస్తారు. కానీ నాన్నకి, తల్లికి, పిన్నికి, బాబాయ్‌కి కూడా తెలుగువాళ్ళు పనికిరారు. పరభాషా నటులే కావాలంటే బాధనిపిస్తుంది. పోనీ నటనాపరంగా గొప్ప ఆర్టిస్టులైన నసీరుద్దీన్ షా, నానాపటేకర్, ఓంపురి వంటి వాళ్ళను తీసుకొచ్చినా తప్పులేదు. కానీ మనవాళ్ళు చేస్తోంది ఏమిటి? రాయితీలు తీసుకుని తెలుగువాళ్ళని కాదంటున్నారు. అదేమంటే 'కోట శ్రీనివాసరావు పరభాషా చిత్రాల్లో నటించడం లేదా?' అని ప్రశ్నిస్తారు. పరభాషా చిత్రాల్లో నటిస్తున్నందుకు గర్వపడతాను. ఎందుకంటే... నేను ఇంట గెలిచి రచ్చ గెలిచా. నటుడిగా తెలుగులో కోట శ్రీనివాసరావు అంటే ఏమిటో నిరూపించుకున్నా. అందరితో ఓకె అనిపించుకున్నా. కానీ మనం ఎలాంటి పరభాషా నటుల్ని తీసుకొస్తున్నాం? తెలుగువారు చేయలేనటువంటి వేషాలని చెప్పి పరభాషల్లో గుర్తింపులేని, అసలు వారెవరో తెలియనటువంటి నటుల్ని తీసుకొస్తున్నారు.

❖

హాయ్ చిన్నారులూ!
మీ అందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు.



పి.వివేకానందం,
పి.నిత్యానందం,
4వ తరగతి,
శ్రీవాణి విద్యాలయం,
వల్లంపట్ల (గ్రా)
యద్దురు మండలం.



శుభాకాంక్షలు చెప్పుకోవడంతోనే సరా...
స్వాతంత్ర్యోద్యమం గురించి కూడా తెల్సుకోవాలర్రా...

కె.జగన్మోహన్, 9వ తరగతి,
జి.హెచ్.స్కూల్, ఎస్.డబ్ల్యు.బోయిస్ హాస్టల్-1, దోర్నాల.



చిట్టి నేస్తాలూ...
పెద్దయ్యాక అన్నిరంగాలలోనూ
అభివృద్ధి సాధిస్తారుకదూ...

ఎం.అవినాష్, 8వ తరగతి,
శ్రీ సరస్వతి విద్యాలయం, కంచరాం (గ్రా), రాజాం (మం), శ్రీకాకుళం జిల్లా.

చిన్నారి చిత్రకారులు

మీరూ ఈ నేస్తాల్లా చక్కటి బొమ్మలేస్తారా? మరైతే ఆలస్యమెందుకు? ఎంచక్కా పోస్ట్ కార్డుమీద బొమ్మ వేసి రంగులు అద్ది మాకు పంపండే. ప్రచురిస్తాం. మా చిరునామా: చిన్నారి చిత్రకారులు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్ నగర్, హైదరాబాద్.

కపోతాలను ఎగరేయడమే కాదు.
శాంతి స్థాపనకూ కృషి చేస్తాం.

ఎం.సింధూర రాణి, 8వ తరగతి,
ఎం.ఆర్.గరల్స్ హైస్కూల్,
రాజీవ్‌నగర్ కాలనీ, విజయనగరం.



చేయీ... చేయీ... కలుపుతాం.
ఐకమత్యంగా ఉంటాం.

ఇంత మంచి బొమ్మ గీసిన చిన్నారి తన వివరాలు పంపలేదు.

భారతమాతను నేను...
భావి పౌరులు మీరు...
మీరంతా కలిసుంటే
నాకదే చాలు.

ఐ.జాన్‌పీటర్,
7వ తరగతి,
శ్రీ రాఘవ విద్యానికేతన్,
మరిపెడ (బంగ్లా),
వరంగల్ జిల్లా.

మేం చెప్పిన రంగులెయ్యండే



హేయ్ బుజ్జాయిలూ... పై బొమ్మలో ఓ బుడ్డోడు వున్నాడు. వాడు నెట్టుతో సీతాకోకచిలుకను పట్టుకోవాలని చూస్తున్నాడు. అదంతా చక్కగా కనిపించాలంటే... బొమ్మలో వున్న అంకెల దగ్గర మేం చెప్పిన రంగులద్దండే. 1-పింక్, 2-బ్రౌన్, 3-రెడ్, 4-ఎల్లో, 5-బ్లూ, 6-గ్రీన్.

చుక్కలు కలిపేద్దాం

కుక్క గొలుసు అంకె ఏది?



ఎక్కడున్నాయబ్బా....





చిన్నారులూ... పై బొమ్మ చూశారా. కుక్కగారు మాంసం తిని హాయిగా నిద్రపోతున్నారుకదూ. మరి పై బాక్సులో కొన్ని ఆకారాలున్నాయి. అవి ఈ కుక్క వున్న ఫొటోలో వున్నాయి. మీరేం చేయాలంటే... చిటికెలో వాటిని కనిపెట్టాలి. ఆలస్యం ఎందుకర్రా! పెన్నో పెన్సిలో తీసుకుని ఆ ఆకారాలకు సున్నా చుట్టండే.

అట్టమీది కథ

కె శివలీల

‘అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మరణం’, ‘అంబేద్కర్ విగ్రహానికి ఉరివేసుకుని చనిపోయిన వ్యక్తి’, ‘అదృశ్యమైన వారంరోజులకు యువతి శవం లభ్యం’ - ఇటువంటి వార్తలు తరచూ వినిపిస్తుంటాయి. నిస్సహాయస్థితిలో ఆత్మహత్యకు పాల్పడుతున్నవారికంటే మోసగాళ్ళు, కిరాతకులచేతిలో హత్యకు గురవుతున్నవారి సంఖ్యే ఎక్కువగా వుంటోంది. ఈ నేపథ్యంలో హంతకులను తేలిగ్గా గుర్తించేందుకు తోడ్పడుతోన్న ‘ఫోరెన్సిక్ సైన్స్’ గురించి ప్రత్యేక కథనం.



ఫోరెన్సిక్ సైన్స్... తిరుగులేని సాక్ష్యం

“నేనామెను హత్య చేయలేదు”

ఎన్ని విధాలుగా ప్రశ్నించినా... ఇదొక్కటే అతని సమాధానం. పోలీసులకు విసుగొచ్చింది. అతన్నో గదిలోకి తీసుకెళ్లారు. ‘ఇంకేముంది ఇంటరాగేషన్ మొదలౌతుంది. అతనిపై థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తారు’ అనుకుంటున్నారు కదూ. కానీ...

ఆ గది... ఖరీదైన కార్పెట్‌తో అధునాతనంగా ఉంది. పోలీసులతన్ని కుర్చీలో కూర్చోబెట్టారు. మెత్తని కుషన్ కుర్చీ అయినా ముళ్లమీద కూర్చున్నట్లుందతనికి. అతని తలకు, శరీరానికి పరికరాలను అమర్చారు. అతనికెదురుగా ఓ కంప్యూటరుంది. దాంట్లో కనిపించిందో ఆయుధం. దాన్ని చూడగానే... అతని కళ్ళు భయంతో రెవరెవలాడాయి. ఒక్కసారిగా తలవిదిలించాడు. మరోసారి పరిశీలించి చూశాడు. ‘అదే కత్తి... అవును దీంతోనే రేవతిని చంపాను. దీన్ని నేను దాచేశానే. వీళ్ళకెలా దొరికింది?!’ అతని ప్రమేయం లేకుండానే దాన్నుపయోగించిన వైనం అతని మెదడులో రీళ్ళు తిరుగుతున్నాయి. ఆ తాలూకు భావాలు అతని మస్తిష్కంలో కనబడీకనబడక ముందే... మరో కంప్యూటర్లో... అతని మెదడులోని కండరాల కదలికలు, ప్రతిస్పందనలు అన్నీ రికార్డయిపోయాయి. కోర్టులో అతడు నేరస్తుడని రుజువైంది.

ఇదెలా సాధ్యం. పోలీసులతన్ని ఇంటరాగేషన్ చేయనేలేదు. అతనికి శిక్షెలా పడింది? నేరాన్ని నిరూపించడానికి పోలీసులు ఏ పద్ధతిని ఆశ్రయించారు? ఇవేనా మిమ్మల్ని వేధిస్తున్న ప్రశ్నలు.

ఇదే సాంకేతిక పద్ధతుల ద్వారా నేరాన్ని నిర్ధారించే ప్రక్రియ... ఫోరెన్సిక్ సైన్స్! నేర పరిశోధనలో సైన్సు



కీలకమైన పాత్రను పోషిస్తుందనడానికో నిదర్శనం.

నేరాల్లోనూ హైటెక్ పద్ధతులు

టెక్నాలజీ పెరుగుతున్న దరిమలా సైబర్ మోసాలు... నేరాలు పెరిగిపోతున్నాయి. నేరస్తులు హైటెక్ పద్ధతులను అనుసరిస్తున్నారు. ఈ నేపథ్యంలో మహిళల సమస్యలు మరింత జటిలమౌతున్నాయి. ఎటు చూసినా అత్యాచారాలు, హత్యలు, లైంగిక వేధింపులు పెచ్చుమీరిపోతున్నాయి. వివాహ వ్యవస్థలో ప్రేమాభిమానాల స్థానాన్ని లాభనష్టాలు, వ్యాపారదృష్టి ఆక్రమించాయి. ఫలితంగా వరకట్నచావులు మితిమీరిపోతున్నాయి. కొన్ని కేసులకు ప్రత్యక్ష సాక్షులే కరువౌతున్నారు. కొన్ని సందర్భాల్లో సమీపబంధువులు, రక్తసంబంధీకులు సాక్ష్యం చెప్పడానికి తటపటాయిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నిందితుణ్ణి నేరస్తుడని ఎలా రుజువుచేయడం? ఇదే పోలీసులను వేధిస్తున్న ప్రశ్న. ఈ హైటెక్ నేరస్తులను చిటికెలో పట్టుకునే సాధనం ఫోరెన్సిక్ సైన్స్ అని చెప్పొచ్చు. వేలిముద్రలు, రక్తనమూనాలను సేకరించడం, ఘటనాస్థలంలోని నేల, మట్టి లాంటివే ఈ పద్ధతిలో పోలీసులకు తగిన సాక్ష్యాధారాలు. ఇవి చాలు ఆ నేరస్తుడిని కటకటాల వెనక్కి తోయడానికి.

ఫోరెన్సిక్ సైన్స్... దీనిలో బాలస్టిక్స్, బయాలజీ, బుల్లెట్ ఫింగర్ ప్రిటింగ్, బ్రెయిన్ ఫింగర్ ప్రింటింగ్, నార్కో ఎనాలసిస్, ఫినైల్ లై డిటెక్టర్,

వీడియో ఫోరెన్సిక్, ఫింగర్ ప్లెతీస్మోగ్రఫీ వంటి పద్ధతులను ఉపయోగించి నేరాలను నిర్ధారిస్తున్నారు.

ఫిర్యాదు చేసినప్పుడే కదా...

ఈ పద్ధతులన్నీ సఫలమయ్యేది తమపై జరిగిన దారుణాలను పోలీసులకు ఫిర్యాదు చేసినప్పుడే కదా. "అయిందేదో అయిపోయింది. ఇంకా ఎందుకు గొడవ? ఏం చేశాడని కంప్లెయింట్ చేస్తావ్? పోనీలెద్దూ... రేపు నలుగురికీ మొహమెలా చూపించడం?"

అత్యాచారాలు, లైంగికవేధింపులపై ఏ బాధితురాలైనా కేసు వేయడానికి ఉత్సాహం చూపించిదనుకోండి... ఇలాంటి మాటలతో ఆమె ఉత్సాహాన్ని నీరుగార్చేవారి శాతం ఎక్కువే. వీటన్నిటినీ తీసి పెట్టి... కోర్టు వరకూ వెళ్ళిందనుకుందాం... తగిన సాక్ష్యం దొరుకుతుందా? ఒకవేళ దొరికి విచారణకొచ్చినా... ఆ పర్వమొక వేధింపుగానే మారుతుందనేది చాలామంది అభిప్రాయం. అందుకే 'ఇవన్నీ ఎందుకు? నిశ్శబ్దంగా ఉంటే కాలమే అన్నింటికీ సమాధానం చెబుతుంది' అనుకుంటూ మిన్నకుండిపోయే కేసులెన్నో...

ఫిర్యాదు చేయడం వరకూ ఎందుకు, ఆఫీసులో బాస్ తనపై అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడనే సంగతి ఒక ఉద్యోగిని తన సహోద్యోగినికి చెబితే... "కార్పొరేట్ కల్చర్‌లో అదేమంత పెద్ద విషయం కాదు. టేకిటీజీ యార్" లాంటి మాటలే ఎదురౌతున్నాయి. దీన్లో టేకిటీజీగా తీసుకోవాల్సిన విషయమేంటి? విదేశీ విచ్చలవిడి సంస్కృతి పేరుతో అదుపులేకుండా ప్రవర్తిస్తున్న బాస్ ప్రవర్తనా? అదుపుతప్పుతున్న అతని ప్రవర్తనను ఎదిరించలేని తన నిస్సహాయతా? అనేది ఆలోచించాల్సిన విషయం.

ఈ విషయాన్నే ఓ ప్రముఖ కార్పొరేట్ సంస్థలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న మహిళతో ప్రస్తావిస్తే... "తనపై జరిగిన అఘాయిత్యాన్ని బట్టబయలు చేసిన తరువాత ఆమె న్యాయంకోసం కోర్టుకెక్కాలి. న్యాయవిచారణ జరిగేలోగా ఆమెకెదురయ్యే హేళనలు, అవమానాలు ఎన్నో... ఈ భయంతోనే నేటి యువత తమపై అత్యాచారం జరిగినా, లైంగిక వేధింపులు జరిగినా నోరుమూసుకుంటోంది" అంటూ వివరించారు.

ఎక్కడివరకో ఎందుకు, రూపన్ బజాజ్ విషయమే తీసుకోండి. ఎనిమిదేళ్ల సుదీర్ఘ పోరాటంలో చివరికి విజయం సాధించినా ఆమె ఎదుర్కొన్న అవమానాలెన్నో... "దేశానికి ఎంతో చేసిన వ్యక్తి కదా... అదేమంత పెద్ద నేరమని కోర్టుకెక్కుతున్నావ్?" అని ఆమెను ప్రశ్నించిన వారెందరో... అవును 'ఓ పార్టీలో గిల్ ఆమె పిరుదులపై చరచటం ఏమంత పెద్ద నేరం?' అన్నవాళ్లెందరో... అంటే మహిళలకు సంబంధించినంత వరకూ ఇది పెద్దనేరమే. కానీ పురుషులకివి నేరాలనిపించడంలేదు కాబోలు.

సాక్ష్యాలే కీలకం...

ఇండియన్ పీనల్ కోడ్ 294, 354, 509 సెక్షన్లు లైంగిక వేధింపులకు, ఈవ్ టీజింగ్‌కు పాల్పడేవారికి తగిన శిక్ష విధిస్తు న్నాయి. కానీ... బాధితులను కలవరపరిచేది ఒకేఒక ప్రశ్న. సాక్ష్యం! అవును. ఇది లేనిదే కేసు నిలబడదు. లైంగిక వేధింపులకు పాల్పడి నవారు 'బుద్ధి పూర్వకంగా అలా ప్రవర్తించారు' అని నిరూపించాలి. 'నాపై ఇలా జరిగింది' అని బాధితు రాలు కోర్టు వరకూ రావడమొక ఎత్త యితే... ఇవన్నీ నిరూపించడం మరొ కత్తు. అనలివన్నీ నిరూపించడం తేలికైన విషయమా?

అవును..!

కోర్టు తీర్పులో మార్పు రావొచ్చు. చివరి నిమిషంలో... మౌఖిక సాక్ష్యాలు ప్రతికూలంగా మారిపోనూవచ్చు. కానీ ఫోరెన్సిక్ సైన్స్ ద్వారా విశ్లేషించి... కోర్టులో ప్రవేశపెట్టిన సాక్ష్యాలు ఎదురులేనివనే చెప్పొచ్చు. తాము నేరాన్ని చేశామని ఒప్పుకోవడానికి మొదట నేరస్తులు మొరా యించినా... ఫోరెన్సిక్ పరీక్షలు సాక్ష్యాధారాలతో సహా నిరూపిస్తుంటే... నిందుతులిక నోరు మెదపలేకపోతారు. 2001లో అసిస్టెంట్ కమిషనర్ శివేంద్రకాంత్ తివారి వద్దకొచ్చిన కేసునే తీసుకుంటే...

"మేం హోండా సిటీ మీదుగా వెళ్తున్నాం. మార్గమధ్యంలో మా కారును దొంగలటకాయించారు. దక్షిణ ఢిల్లీలోని మునిర్కావైపు మళ్లించారు. అక్కడికెళ్లిన తరువాత మా దగ్గరున్న నగలన్నీ వారికివ్వాలని రివాల్వర్‌తో బెదిరించారు. రజని భయంతో గట్టిగా కేకలేసింది. దాంతో వాళ్ళామెను కాల్చేశారు. ఆ తరువాత నా కాలిపై కాల్చి వారు పారిపోయారు" ఇది కొత్త పెళ్లి కొడుకు విజయకుమార్ పోలీసులకు చెప్పిన కథనం.

రజనిని దొంగలు చంపారనడానికి కుమారే ప్రత్యక్ష సాక్షి. ఏ హంతకుడైనా ప్రత్యక్షసాక్ష్యులను వదిలిపెడతారా? అది హంతకుడిని కటకటాల వెనక్కు నెట్టదా? మరి కుమార్ చెబుతున్నది ఎంతవరకు నిజం. తివారి మనసులో ఇవే ప్రశ్నలు మొలకెత్తాయి. కుమార్ ప్రవర్తనపై తివారి చుట్టుపక్కలవారిని ఆరాతీశాడు. 'భార్య అందమైనదనీ, తనకన్నా ఎక్కువ చదువుకుందనీ అతనికామెపై అసూయ' ఇదే మూకుమ్మడిగా వారిచ్చిన సమాచారం.

తివారి ఒక ఫోరెన్సిక్ నిపుణుడిని పిలిపించారు. కుమార్ కాలిగాయం పిస్టోలువల్ల ఏర్పడింది కాదనీ, కాలిన గాయమనీ ఫోరెన్సిక్ పరీక్షల్లో తేటతెల్లమైంది. చివరకు తన భార్యను చంపడానికి తానే ఇద్దరు హంతకులను నియమించినట్లు కుమార్ అంగీకరించాడు.

ఇంకో కేసును పరిశీలిస్తే... 2003





జులైన బెంగళూరుకు సమీపంలోని హెబ్బల్ నివాసి సవిత దారుణంగా హతమైంది. నిందితుడైన ఆమె భర్త వీరేగౌడను పోలీసులు లై డిటెక్టర్, నార్కో అనాలసిస్ పరీక్షలకు పంపారు. అతను ట్రాన్స్‌లోకెళ్లాడు. 'సవిత నా తల్లిదండ్రులను సరిగా చూడదు. ఆమె ప్రవర్తన నమ్మశక్యంగా ఉండదు. అందుకే నేనీ హత్యకు పాల్పడ్డాను' ఇది అతని మాటల్లోని సారాంశం. చివరికి ట్రాన్స్ నుంచి బయటికొచ్చాడు. ఈ విషయాలన్నింటినీ పోలీసులు తిరిగి అతనికి వినిపించారు. చివరికతను నేరాన్ని ఒప్పుకున్నాడు.

ఎన్నోకేసులు...

ఆసుపత్రిలో పసిపిల్లలను దొంగిలించిన కేసులనుండి, కుంభకోణం కేసులవరకు ఎన్నో కేసులను ఫోరెన్సిక్ సైన్సు సహాయంతో నిరూపించారు.

స్టాంపుల కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు అబ్దుల్ కరీం తెల్గీ కేసులో పోలీసులకు సహకరించింది ఫోరెన్సిక్ సైన్స్ ప్రక్రియే. ఎలాగో తెలుసుకోవాలనుందా.... స్టాంపుల కేసులో తెల్గీని పోలీసులు అరెస్టు చేశారు. కొన్ని నెలల తర్వాత... కర్ణాటక నేరపరిశోధక అధికారులు అతనిపై నార్కో అనాలసిస్, బ్రెయిన్ ఫింగర్ ప్రింటింగ్ పద్ధతులను ప్రయోగించారు. ఫలితంగా... తన సహచరుల పేర్లను, రూపొందించిన ప్రణాళికలను తెల్గీ ఏకరువు పెట్టాడంటే ఆశ్చర్యంగా ఉంది కదూ.

మధుమితా శుక్లా హత్య కేసునూ ఈ ప్రక్రియ ద్వారానే సాధించారు. హత్యా సమయానికి మధుమితా శుక్లా నాలుగు నెలల గర్భిణి. అమర్‌మణి త్రిపాఠికి ఆమెతో అక్రమ సంబంధముందనీ, ఆమె హత్యలోనూ అతని హస్తముందనీ తెలిపే పలు ఆరోపణలు వెలుగులోకొచ్చాయి. ఉత్తరప్రదేశ్ పోలీసులు ఈ కేసును సిబిఐకి అప్పగించారు. వీరు మధుమిత మృతదేహానికి డిఎన్ఎ ఫింగర్ ప్రింటింగ్ పరీక్షను నిర్వహించారు. ఆమె గర్భంలోని బిడ్డకు తండ్రి త్రిపాఠి అని ఆ పరీక్షలు నిర్ధారించాయి. దాంతో పోలీసులతన్ని అరెస్టు చేశారు. అయినా అతను ఈ విషయాన్నంగీకరించలేదు. మధుమితతో తనకెలాంటి సంబంధమూ లేదని వాదించసాగాడు. అనంతరం అతన్ని పాలీగ్రాఫ్ పరీక్షకు పంపారు. ఈ పరీక్షలో అతను చెబుతున్నవన్నీ అబద్ధాలని తేలింది.

ఇవేకాక ఆసుపత్రిలో అదృశ్యమైన పసిపిల్లలకు సంబంధించిన కేసులను ఈ ఫోరెన్సిక్ ప్రక్రియ ద్వారానే సాధించారు. డిఎన్ఎ పరీక్ష ద్వారా అసలైన తల్లిని నిర్ధారించారు. అనేక పసిపిల్లల కేసులను సాధించిన ఘనత హైదరాబాద్‌కు చెందిన ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీకే దక్కుతుంది. నేరనిర్ధారణలో డిఎన్ఎ పరీక్ష అత్యంత శక్తివంతమైన సాధనం. నిందితులను నేరస్తులుగా ఋజువుచేయడానికీ, నేరంతో ఏమాత్రమూ సంబంధంలేని వారిని రక్షించడానికీ ఇవి ఉపయోగపడతాయి.

గ్లోబల్ క్రైం ఇన్వెస్టిగేషన్‌లో ఇతర సాక్ష్యాధారాలకన్నా... నిందితునికి చేసే శారీరక పరీక్షలే కీలకపాత్ర వహిస్తాయి. డిఎన్ఎ ఫింగర్ ప్రింటింగ్, బ్రెయిన్ ఫింగర్ ప్రింటింగ్ పరీక్షలు నిందితునిపై నిర్వహించినప్పుడు... అతని స్వరంలో వచ్చే మార్పులను, స్పందిస్తున్న తీరును, గుర్తిస్తుందో పరికరం... అదే లై డిటెక్టర్. 'నిందితుడు చెబుతున్నది అబద్ధమా? లేక నిజమా?' అన్న విషయం ఈ పరికరంద్వారా చిటికెలో నిర్ధారణ అవుతుంది. ఈ పద్ధతులన్నింటిలో బ్రెయిన్ ఫింగర్ ప్రింటింగ్ చాలా శక్తివంతమైంది. ఈ పద్ధతిలో ఫోరెన్సిక్ నిపుణులు... నేరానికి సంబంధించిన వస్తువుల ఫోటోలు మానిటర్‌ద్వారా నిందితుడికి చూపిస్తారు. ఆ వ్యక్తి తాను చేసిన నేరాన్ని ముఖతః అంగీకరించకపోయినా... అతని మెదడు వెనువెంటనే వాటికి స్పందిస్తుంది. ఇందులో అతని ప్రమేయం ఏ మాత్రమూ అవసరం లేదు. ప్రస్తుతం ఫోరెన్సిక్ నిపుణులు, నేర పరిశోధకులు ఈ విధానం ద్వారానే తమ పరిశోధనలు సాగిస్తున్నారు. ఇది నేరపరిశోధనలో ఓ మైలురాయనే చెప్పొచ్చు.



హత్య జరిగిన తరువాత... నిందితుడి మెదడులో నిక్షిప్తమైన ఆ తాలూకు చిహ్నాలను వెలికియడం... అతను హంతకుడని గుర్తించడం... నేరపరిశోధనలోనే ఓ మైలురాయి. ఇది కచ్చితంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి నిదర్శనం. దీని ద్వారా హంతకులనైతే పట్టుకోగలం కానీ... నానాటికీ పెరిగిపోతున్న అరాచకాలు, నేరాలు, ఘోరాలను దీంతో అడ్డుకోలేం కదా... వీటికి అడ్డుకట్ట వేయాలంటే... వ్యూహాన్ని రచిస్తున్నప్పుడే... ఆ వ్యక్తి మనసులోని పరిణామాలు... ఆలోచనలు తెలుసుకోవాలి మరి. అలాంటి పరిజ్ఞానమే గనుక మనకి అందుబాటులోకి వస్తే... అసలు నేరాలు జరగడానికే ఆస్కారం ఉండదు కదా. ఆరోజు త్వరలోనే రావాలనాశిద్దాం.

❖

ఆరోగ్యం

కృత్రిమ డిస్క్‌లను అమర్చవచ్చు

డాక్టర్ జివివి సుబ్బయ్య,
స్పైన్ సర్జన్, గ్లోబల్ హాస్పిటల్స్,
హైదరాబాద్.

శరీరానికి వెన్ను దన్నుగా ఉండి, తన ద్వారా శరీర భాగాలన్నింటికి నరాలను వ్యాపింపజేస్తుంది వెన్నుపాము. వెన్నుపాములో 33 పూసలుంటాయి. వీటి మధ్య నుంచి వెన్ను నరాలు వెళ్తుంటాయి. వెన్నుపూసకు, వెన్నుపూసకు మధ్య డిస్క్‌లు కందెనలా పనిచేస్తుంటాయి. ఈ డిస్క్ ప్రొలాప్స్ అయినా... వెన్నుపూసలు పక్కకి జరిగినా నరాల మీద ఒత్తిడి కలిగించినా విపరీతమైన నొప్పి ఉంటుంది. స్పైన్ బోన్స్‌తో, డిస్క్‌తో లిగమెంట్స్‌తో ఉంటుంది. ఈ డిస్క్‌లు వెన్నుపూసల ఎముకల మధ్య 'షాక్ అబ్జర్బర్స్'లా పనిచేస్తాయి.

ఈ డిస్క్‌ల మధ్య భాగంలో జెల్లీలాంటి పదార్థం 'న్యూక్లియస్' ఉంటుంది. దాని చుట్టూ గట్టి యాన్యులస్‌ఫైబ్రోసిస్ ఉంటుంది. డిస్క్ మెటీరియల్ జెల్లీ నీరు, కొన్ని ప్రోటీన్లతో కలిసి ఉంటుంది. క్రమంగా నీరు తగ్గి యాన్యులస్‌ఫైబ్రోసిస్ ఫ్లాట్ అయి, బీటలువారుతుంది. ఇలాంటి డిస్క్‌ల వల్ల నొప్పి కలుగుతుంది. డీజనరేటివ్ డిస్క్‌లోపల జెల్లీ లాంటి పదార్థం తర్వాతున్న యాన్యులస్‌ఫైబ్రోసిస్ వైపు గట్టిగా నొక్కబడుతుంది. ఇలా జరగడం వల్ల నొప్పిపుడుతుంది. యాన్యులస్‌లో పగుళ్లు వస్తాయనుకున్నాం కదా! ఆపగుళ్లలోనించి లోపలి న్యూక్లియస్ బయటకు నెట్టబడవచ్చు. ఇలాంటి డిస్క్ విపరీతమైన నొప్పిని కలిగిస్తుంది. శస్త్రచికిత్స చేసి దీన్ని తీసివేయడమే చికిత్స.

మెడప్రాంతంలో డిస్క్‌ప్రొలాప్స్ అయితే చేతుల్లోకి నొప్పి వస్తుంది. ముందు మత్తులో ప్రయత్నించి, తగ్గకపోతే శస్త్ర చికిత్స ఒక్కటే మార్గం. మెడ ప్రాంతంలో వెన్ను శస్త్ర చికిత్స వెనుక నుంచి చేయవచ్చు. ముందు నుంచి చేయవచ్చు. దీన్ని 'సెర్వైకల్ డిసెక్టమీ' లేక 'వెర్టిబ్రెక్టమీ' అంటారు. డిస్క్‌ని తీసివేసి, ప్లేట్, స్క్రూస్‌తో బిగిస్తారు. మెడలోని బోన్స్ ఫ్యూజ్ చేయడం సాధారణ చికిత్స. మెడపట్టీని ఆరు వారాల పాటు వేసుకోవలసి ఉంటుంది.

సెర్వైకల్ ఫ్యూజన్ వల్ల డిస్క్‌లు కలిసిపోయి, మిగతా వెన్ను మీద భారం బాగా పడుతుంది. కాబట్టి డిస్క్‌తొలగించి ఫ్యూజ్ చేయకుండా, ఆ స్థానంలో కృత్రిమ డిస్క్‌ని పెడుతున్నారు. ఇలా కృత్రిమ డిస్క్‌లనుంచడం వల్ల రెండు లాభాలున్నాయి. కదలికలు రిస్ట్రిక్ట్‌కావు, పక్క సెగ్మెంట్‌కి డీసీజ్‌రాదు. మొదట్లో స్టెయిన్‌లెస్ స్టీల్ బాల్స్ పెట్టేవారు. బ్రయాన్ సెర్వైకల్ డిస్క్ ప్రొస్థెసిస్ ఇప్పుడు లభిస్తోంది. బాల్ అండ్ సాకెట్ సిస్టమ్ కూడా అందుబాటులో ఉంది. కాబట్టి డిస్క్



ప్రొలాప్స్ అని మనం భయపడనక్కరలేదు. దెబ్బతిన్న డిస్క్ తీసేసి, దాని స్థానంలో మనకు కావాల్సిన కృత్రిమ డిస్క్‌లను పెట్టించుకోవచ్చు.

వెన్ను శస్త్ర చికిత్సలంటే భయపడనక్కరలేదు. పెద్ద కోతపెట్టరు. ఎక్కువ రోజులు ఆసుపత్రుల్లో ఉండాల్సిన పనిలేదు. తక్కువ కోతతో మినిమల్లీ ఇన్‌వేజివ్ స్పైన్ సర్జరీల ద్వారా చికిత్స చేస్తే రక్తస్రావం ఎక్కువ ఉండదు. నొప్పి తక్కువ, హాస్పిటల్‌లో ఎక్కువ రోజులు ఉండాల్సి ఉండదు. కాబట్టి వెన్ను శస్త్ర చికిత్సలంటే ఇప్పుడు ఎటువంటి భయానికి లోనుకావాల్సిన పనిలేదు.

❖

కథ

లోకం తీరు

ఇంద్రగంటి జానకీబాల

"ఫరవాలేదు. కానీ, గొప్ప జాతకమేం కాదు" వేళ్లు మడిచి, మూసి, ఏవేవో లెక్కలు వేసి, తేల్చాడు బాబయ్య.

"అయితే మనకు వద్దే వద్దు" అంది శారదమ్మ.

శారదమ్మ ఆ ఫొటోనే మళ్లీ తీసి, అటూ ఇటూ పరికించి చూసి, దానికి జతపరచిన వివరాల కాగితం జాతకం చూసింది. ఆ పెళ్లికూతురి వివరాలు వచ్చి మూడు రోజులైంది.

"పిల్లెలా వుందీ?" అన్నాడు ముసలి బాబయ్య.

"ఏదో ఉంది. అయినా జాతకం కలవకపోతే వాడికి ఆ ఫొటో చూపించడమూ దండగే" అంది చప్పరిస్తూ.

"అది కాదే శారదా! ఆ ఫొటో రాంబాబుకు చూపించు, వాడికొస్త నచ్చినట్టుగా అనిపిస్తే జాతకం లోతుగా చూస్తా" అన్నాడాయన. అందుకే ఇప్పుడు రాంబాబుకు ఫొటో చూపించి "ఈ పిల్లెలా ఉందిరా?" అంది.

ఆ అమ్మాయి ఫొటోని ఓసారి చూసి, నిర్లక్ష్యంగా పక్కన పడేశాడు రాంబాబు.

రాంబాబుకు ముప్ఫైయేళ్లు నిండాయి. ఎనిమిది, పదేళ్ళుగా కనిపించిన అందమైన అమ్మాయినల్లా ప్రేమిస్తూనే ఉన్నాడతను. అందులో ఎక్కువమంది సినీతారలే! నూనూగు మీసాలొస్తున్నప్పుడు శ్రీదేవిని ప్రేమించాడు. కొన్నాళ్లకు జయప్రదను, తర్వాత మాధురీ దీక్షిత్, జూహీచావ్లా, మీనాక్షీశేషాద్రి, రవీనా టాండన్ నెమ్మది నెమ్మదిగా సోనాలీ, సిమ్రాన్‌లనూ ప్రేమించాడు. వదిలేశాడు. తనకు పెళ్లి సంబంధాలంటూ వస్తే ఆ అమ్మాయి దగ్గరదగ్గరగా ఈ జాబితాలోని తారల స్థాయిలో ఉండాలనుకునేవాడు. అదే దృష్టితో చూడటంతో అతనికెవ్వరూ నచ్చలేదు. అలా సుమారు ఆరేళ్లు గడిచిపోయాయి. దీనికి తోడు శారదమ్మకు జాతకాలమీద విపరీతమైన నమ్మకం. 'ముందు జాతకం కలవాలి, ఆ తర్వాతే పిల్లను చూడాలి' అని నియమం పెట్టుకుందావిడ. ఇదీకాక పిల్ల అందంగా ఉండాలనేది ప్రథమ కోరిక. అయితే అందం విషయం కొడుకు చూసుకుంటాడు కనుక తను ఐశ్వర్యం, జాతకం, కట్నకానుకలు గట్రా విషయాలు చూద్దామని ఆ తల్లి ఆరాటం. తల్లీకొడుకుల పరీక్షలకు నిలిచేటువంటి సంబంధాలు రావడం లేదు. కాస్తోకూస్తో బాగున్న పిల్లలకు పెళ్ళిళ్ళయిపోయాయి. రాంబాబు ఇంకా వేటలోనే ఉండిపోయాడు.

అక్కడే బల్లమీదున్న ఫొటోను తీసి చూశాడు పరశురాం. కొడుకు పెళ్లి సంగతి గురించి ఎప్పుడూ ఆలోచించడతను. ఎందుకంటే అతని అభిరుచులు, భావాలు తల్లీకొడుకులకిద్దరికీ సరిపడవు. ఉద్యోగం నుంచి రిటైరయి నాలుగేళ్లయినా కొడుకు పెళ్లివిషయంలో తలదూర్చలేదు. అయినా అప్పుడప్పుడూ ఏదోక మాట అంటూనే ఉంటాడు. తల్లీకొడుకులిద్దరూ ఇంతెత్తున లేస్తూనే ఉంటారు.

"పిల్ల బాగానే ఉంది కదరా" అన్నాడు కొడుకువైపు చూసి పరశురాం. రాంబాబు టీవీ ఛానళ్లు మార్చడంలో నిమగ్నమయ్యాడు. తండ్రికి ఎటువంటి సమాధానమూ ఇవ్వలేదు.

"శారదా! ఆ పిల్ల జాతకమెలా ఉంది?" అన్నాడు.

"ఏంటీ! పిల్ల బాగుందా?" అన్నాడు రాంబాబు విసురుగా

"ఆ... ఆయనకందరూ బాగానే ఉంటారు" అంది శారద.

"నిజమే మరి! నిన్ను చూసిన కళ్లతో ఎవరైనా బాగానే అనిపిస్తారు" నవ్వు ముఖంతో అన్నాడు.

"చాల్లెండి హాస్యం" అంది.

"హాస్యం కాదు, నిజమే! నువ్వు పెళ్లి చూపుల నాటికీమాత్రమూ లేవు మరి"

"నేనప్పుడు చిన్నపిల్లను. అయినా నా అందానికేం తక్కువ?" అంటూ మూతి తిప్పింది.

"ఒరే రాముడూ, నేను కూడా చిన్నప్పుడు సావిత్రి, మధుబాల, జమునలను ప్రేమించిన వాణ్ణే! వాళ్లందరినీ మీ అమ్మలోనే చూసుకున్నా" అంటూ ఎగతాళిగా నవ్వుకుంటూ వెళ్లిపోయాడు లోపలిగదిలోకి.

శారదమ్మ మూతి ముప్పై వంకర్లు తిప్పి "నేనెంతమందిని ప్రేమించానో చెప్తే, గుండాగి చస్తారు" అంది.

రాంబాబు మాత్రం "నాకు పిల్ల నచ్చలేదమ్మా" అన్నాడు.

"జాతకమూ అంత బాలేదు" అని తల్లి తాళం వేసింది.

* * *

రోజులు వేగంగా గడిచిపోతున్నాయి. క్యాలండర్‌లో నెలలు తిరిగిపోతున్నాయి. ఏళ్ళు గడిచాయి. రాంబాబుకు ముప్ఫైఅయిదేళ్లు నిండాయి. చూద్దాంలే అనుకుంటూ శారదమ్మ కూర్చుంది. సంబంధాలు రావడం సన్నగిలిపోయింది. శారదమ్మకు బెంగ మొదలైంది. కొడుక్కి ఆరాటం పెరిగింది. మిత్రులు అతణ్ణి చూసి ఛలోక్తులు విసరడం మొదలెట్టారు.

"వాడికి పిల్లని చూపించడం దండగ. నచ్చదు" అంటూ అతని ముఖం మీదే నవ్వుతూ అంటున్నారు.

"అదేంటి? వాడికి నచ్చలేదు. అంతే! దానికి ఆర్యుమెంటేంటి? నువ్వు వాడి కళ్ళెట్టుకు చూడు" అంటూ చమత్కార సంభాషణలు అతనెదుటే సాగించేవారు.

కాస్త వయసు మళ్లినవాళ్లు "బ్రహ్మచారి ముదిరినా..." అంటూ హితబోధ చేసేవారు.

నెమ్మదిగా రాంబాబులో నిరాశ చోటు చేసుకుంది. ఏమీ తోచని మనస్థితి ఏర్పడింది. 'అసలు తనకేం కావాలి?' అనేది అర్థంకాలేదతనికి.

అతని వయసుకు తగిన పిల్లలు తగ్గిపోయారు. ఒకవేళ ఉన్నా, పెద్దపెద్ద చదువులతో, ఉద్యోగాలతో, అంతస్థుతో రాంబాబు స్థాయికి మించిపోయారు. ఆఫీసులో తనకంటే ఎక్కువ స్థితిలో ఉన్న అమ్మాయిలకెందరికో మనసిచ్చేశాడు. వాళ్లెవరూ ఆ మనసును తీసుకున్న ఛాయలుగానీ, తమ మనసిచ్చిన దాఖలాలు గానీ కనిపించలేదు. ఉత్తుత్తి ఊహల్లోనే అన్నీ జరిగిపోతున్నట్లనిపించేది.

కొడుకు పెళ్లి విషయంలో శారదమ్మకు, పరశురామ్‌కు తరచూ ఘర్షణ వస్తూనే ఉండేది.

"ఈ జాతకాల గొడవేమిటే నీకు?" అనేవాడాయన.

"మా నాన్న నలభై ఏళ్ల క్రితం జాతకాలు సరిగ్గా చూడకుండా మన పెళ్లి చేశాడు. అందుకే మనమిలా ఉన్నాం" అంటూ శారదమ్మ ధ్వజమెత్తేది.

"ఇప్పుడేమైంది? ఇన్నాళ్ళు బాగానే కాపురం చేశాం. ఎప్పుడూ నీమాటే నెగ్గించుకొచ్చావు. నగలు, నట్రా చీరలు, చీనాంబరాలు అన్నీ బాగానే సాధించుకున్నావు. మరిప్పుడు మన జాతకాలకేమొచ్చింది?"

"ఏమో నాకెప్పుడూ మీరంటే ఇష్టంలేదు. మావాళ్ళు బలవంతంగా మీతో పెళ్లి జరిపించారు"

శారదమ్మకు కోపం బాగా నెత్తికెక్కినప్పుడు ఇష్టమొచ్చినట్లు మాట్లాడేస్తుందని పరశురాంకు తెలుసు. అందుకే ఆయనేం పట్టించుకోలేదు. మళ్లీ ఆమే అందుకుంది.

"నా కొడుకూ, కోడలూ అన్యోన్యంగా ఉండాలి మనలా కాకుండా... అందుకే ఈ జాతకాలు" అంది.

"వాళ్లు అన్యోన్యంగా ఉంటే నువ్వుండనిస్తావా ఏం?" అన్నాడు పరశురాం.

"అబ్బ! ఇంక ఆపండి మీ వాదం. పెళ్లయ్యాక నేనిక్కడుంటే కదా" అన్నాడు రాంబాబు.

శారదమ్మ ఉలిక్కిపడి "అదేమిటి నాన్నా!" అంది. 'మా అమ్మ దేవత. కోడల్ని కూతురిలా చూసుకుంటుంది' అంటాడని ఎదురుచూసిన శారదమ్మకు ఎదురుదెబ్బ తగిలింది. తర్వాతి అంశంగా ఆమెకు ఏడుపొచ్చేసింది. గొంతు పూడుకుపోయింది.

* * *

హడావుడిగా ఇంట్లోకొచ్చి "ఏమండోయ్. ఇది మీకు తెలుసా? మీ తమ్ముడి మూడో కొడుక్కు పెళ్ళి స్థిరపడిందటగా" అంది శారదమ్మ.

"నాకు తెలీదే, నీకెవరు చెప్పారు?" అన్నాడు.

"సుందరమ్మ గుళ్ళో కనిపించింది. ఆవిడే నాకీ విషయం చెప్పింది"

"ఆమెగారికెలా తెలుసూ?" అన్నాడు.

"వాళ్ల చెల్లెలి కూతురేనట"అంది.

"మరి వాళ్ళు నియోగులు. మనం వైదికులం కదా" అన్నాడు సంశయంగా.

"అవన్నీ పట్టించుకోకుండా కుదుర్చేసుకున్నారులాగుంది"

"మరి నువ్వేమో మన వాళ్లమ్మాయే కావాలంటున్నావు కదా"

"అన్నాను. అయినా కుదరలేదుగా. ఎవరైతేనేం పిల్ల బుద్ధిమంతురాలైతే చాలు" అంది శారదమ్మ.

"ఆ విషయం జాతకంలో రాయరనుకుంటా" అన్నాడు.

"అయ్యో రామ. మనవాడి కంటే అయిదేళ్లు చిన్నవాడు, ఆఖరివాడు.. వాడికీ పెళ్లి కుదిరిపోయింది. వీడిలాగే ఉన్నాడని నేను బాధపడుతుంటే మీరేమిటి జోకులేస్తారు?" అంది.

"జోకులేం కాదు. వీడికీ చేసేయ్" అన్నాడు నెమ్మదిగా.

"ఎంతసేపూ నా తాపత్రయమేగానీ మీకేం పట్టినట్టుగా లేదు" అని సణుక్కుంటూ ఉండిపోయింది.

ఆ సాయంత్రం "శారదక్కా శారదక్కా" అంటూ తోడికోడలొచ్చింది.

"రామ్మా రా" అంటూ ఏమీ



ఎరుగనట్లు ఆహ్వానించింది.

"మా వాడికి పెళ్ళి కుదిరింది. చెప్దామని వచ్చాను" అంటూ మొదలెట్టి, విశేషాలు చెప్పి కాసేపు రాంబాబు పెళ్ళి గురించి వాకబు చేసి, కాఫీ తాగి ఆమె వెళ్లిపోయింది.

శారదమ్మ కడుపులో మంట ఒక్కసారిగా భగ్గుమంది. ఏదోకటి చేయాలని నిశ్చయించుకుంది.

పదిరోజుల్లో రాంబాబుకు పెళ్ళిచూపులు ఏర్పాటు చేశారు. పిల్ల వీళ్ల శాఖ కాదు. బిఏ చదివింది గానీ ఉద్యోగం అదీలేదు. శారదమ్మ జాతకం ప్రసక్తి తేలేదు. రాంబాబు కాసేపు బాలీవుడ్, టాలీవుడ్ నటీమణులందర్నీ మర్చిపోయాడు. తల్లీకొడుకులకు పిల్ల నచ్చింది. తండ్రి ఆమోదముద్రేశాడు.

"మేం కట్నం ఇచ్చుకోలేం" అన్నారు.

"అసలు నేను కట్నమివ్వడానికీ, పుచ్చుకోవడానికీ వ్యతిరేకిని" అన్నాడు రాంబాబు.

'పిల్ల రంగులో ఏముంది, పొడుగులో ఏముంది? ఏదో చదువుకుంది. మనకెలాగూ ఉద్యోగం చేయించే ఉద్దేశం లేదుకదా' లాంటి మాటలతో పెళ్ళి స్థిరపడిపోయింది.

రాంబాబు మహా ఉత్సాహంగా ఉన్నాడు. కనిపించిన వాళ్ళందరికీ తన పెళ్ళి సంగతి చెబుతున్నాడు. శారదమ్మ కూడా ఆనందంగానే ఉంది. జాతకాలు, రంగులు, పొట్టిపొడుగులు, చదువు, ఉద్యోగాలూ అన్నీ 'ఉష్'మని ఎగిరిపోయాయి.

శారదమ్మకు ఒక్కటి మాత్రం గర్వంగా ఉంది. తోడికోడలి ఆఖరి కొడుకు పెళ్ళికంటే ముందే తన ఒక్కగానొక్క కొడుక్కు పెళ్ళి చేయగల్గుతోన్నందుకు.

'ఇక్కడీ పిల్ల రాసిపెట్టి ఉంటే, ఎన్ని చూసినా ఎలా కుదురుతుంది?' అంటూ చాలామందిలాగే కర్మసిద్ధాంతాన్ని వల్లించేస్తూ గలగలా నవ్వేస్తోంది.

అవును మరి, ఎవరికి మాత్రం తమ తప్పిదాన్ని ఒప్పుకోవడం ఇష్టంగా వుంటుంది?! అలాంటప్పుడు దేవుడిమీదికో, విధిమీదికో తోసేయకపోతే తేలిగ్గా ఊపిరి పీల్చుకోవడమెలా?!

❖

సెన్సు కామన్ సెన్సు

పులికల్యాణి

"రోజూ వంకాయలెందుకే...? తినలేం గదా. వద్దు" అంటే... "ఒక్క అరకిలో తీస్కోండి, మీ ఇష్టం మీరెంతిచ్చినా పరవాలేదు. మీ బోణీ చాలా మంచిదమ్మా!" అంటుంది. మా ఆవిడ విసుక్కుని ఓ రూపాయో రెండో చేతిలో పెట్టిందాకా ఆవిడక్కణ్ణించి కదలదంటే కదలదు.

బోణీ

'బోణీ' అన్న పదం చాలా లౌక్యంతో కూడుకున్నదైనా అయ్యుండాలి. లేదా పరమమూర్ఖశిఖామణులయ్యుండి వాళ్ళు దాన్ని మనస్ఫూర్తిగా నమ్మేదైనా అయిఉండాలి. అసలిది మార్కెట్టుపదం. నిత్యజీవితంలో మార్కెట్టు అవసరాలకు తప్పించి సాధారణంగా మరెక్కడా వినిపించకపోవచ్చు. అయితే విచిత్రంగా నేను చదువుకునేరోజుల్లో మా మిత్రుడినోటనుండి... అదీ విద్యావిషయంలో వినడంతో ఆరోజుల్లోనే కొయ్యబారిపోయాను.

ఖమ్మం కాలేజీలో డిగ్రీ చదివే రోజులవి. నేనొక రూం తీసుకుని చదువుకునేవాణ్ణి. మరో వీధిలో మా క్లాస్‌మేట్స్ ఇద్దరుండేవారు. ఫైనలియర్ పరీక్షలు దగ్గర పడుతున్నాయి. రాత్రి పదిగంటలకు టీ తాగి వాళ్ల రూములోకి అడుగుపెట్టాను. ఇద్దరూ వెర్రి ముఖాలేసుకుని, పుస్తకాలు ముందేసుకుని పేజీలు తిరగేస్తున్నారు.

"ఏరా... బాగా ప్రిపేరవుతున్నారా?" అన్నాను.

అందులో ఒకడు "ఇవాళే బోణీరా" అని ఓ వెర్రినవ్వు నవ్వాడు. అంటే ఈ సంవత్సరకాలమంతా వాళ్లు పుస్తకం తెరవలేదు. సినిమాలూ, షికార్లూ, సరదాలూ సరిపోయాయన్నమాట. ఓరి వెధవల్లారా? ఇంకా పరీక్షలు పదిరోజుల్లేవు. బోణీ ఎంట్రా రాస్కెల్స్'ని విసుక్కుని నారూముకొచ్చేశాను.

పొద్దున్నే మా ఆవిడ ఇంటిముందే కూరగాయలు కొంటోంది. కూరగాయలమ్మ బుట్టదించి ఏవో కబుర్లు చెబుతోంది. బేరం చేయడంలో మా ఆవిడ గీసిగీసి చేస్తుంది. రేటు సగానికిసగం అడుగుతుంది.

''అమ్మగారూ... మీ చేయి చాలామంచిది. మొన్న మీరు బోణీ చేశారుగదా? నేను గీరోడ్డు దాటి పక్క సందులోకి పోయిన గద.. మొత్తం తెచ్చిన సరుకంత ఖతమయిపోయింది. నేను గాదినం పదిగంటలకే ఇంట్ల పడ్డ. గింత తిని కూలిగ్గూడ పోయ్న. గది... బోణీ అంటే గట్లుండాలి లె...!"

నేను ఆసక్తిగా వింటున్నాను. తర్వాత సౌండుతగ్గి గుసగుసలవైపులోకి దిగిపోవడంతో నేను జాగ్రత్తగా చెవులు రిక్కించాను. ఎదురింటి ఆండాళమ్మకూ, మా ఆవిడకూ మాటపట్టింపు ఎందుకు వచ్చిందో తెలీదు. పైకి చిరునవ్వుల్తో మాట్లాడుకున్నా... చాటు కాంగానే మూతులు విరుచుకుంటారు.

"...ఆవిడగారు నిన్న బోణీ చేసిందా... ఇంగ చూస్కోండి. సరుకంతా అమ్మేసరికి సాయంకాలం నాలుగైంది. టిఫిన్‌గిన్నె తెచ్చుకోలేదు. సంపుకాడ గిన్ని మంచినీళ్లు తాగిన. ఏం బోణీయోనమ్మ?"

ఇది బొత్తిగా లౌక్యానికి సంబంధించినది. ఎందుకంటే తర్వాత మరి మారుమాట్లాడకుండా, బేరాలుపడకుండా మా ఆవిడ ఆ కూరగాయలమ్మ చెప్పిన రేటుకే చకచకా కొనేసి డబ్బిచ్చి పంపింది.

అమాయకమైన బోణీలు కూడా ఉంటాయి. ఒక లంబాడా యువతి వాళ్ళ తండాలో, వాళ్ళ బావిదగ్గర వంకాయలూ, బీరకాయలూ వేసుకుంది. అవి పుష్కలంగా పండుతున్నాయి. వాటిలో ఏదో ఒకటి తెచ్చి మా ఆవిడను కొనమని పట్టుబడుతుంటుంది.

"రోజూ వంకాయలెందుకే...? తినలేం గదా. వద్దు" అంటే... "ఒక్క అరకిలో తీస్కోండి, మీ ఇష్టం మీరెంతిచ్చినా పరవాలేదు. మీ బోణీ చాలా మంచిదమ్మా!" అంటుంది. మా ఆవిడ విసుక్కుని ఓ రూపాయో రెండో చేతిలో పెట్టిందాకా ఆవిడక్కణ్ణించి కదలదంటే కదలదు. ఇది పూర్తిగా చాదస్తం. మార్కెట్‌నిండా సరుకు భారీగా ఉన్నప్పుడు ఎట్లాగూ పోటీ ఉంటుంది. అమ్మకాలు కూడా మందగిస్తాయి. అవసరాల్ని బట్టి కూడా ఈ అమ్మకాలుంటాయి. చేతివాటం మంచిదనుకోవడం ఉత్తి చాదస్తం మాత్రమే.

క్రికెట్ పరుగుల్లోనూ... ఏ ధోనీనో, సెహ్వాగో- సిక్సో, బౌండరీనో కొడితే క్రికెట్ అభిమానులు చప్పట్లు చరిచి "అబ్బ... బోణీ అయిందిరా...! ఇక పరవాలేదు" అంటారు. ఇది వూంచి ఉల్లాసంలోంచి పుట్టుకొచ్చిన చాదస్తమన్నమాట.

ఉదయమే చూసుకుంటే పేస్టులేదు. నిన్న తెచ్చుకోవడం మీరు మర్చిపోయారు. మీ ఆవిడ కూడా గుర్తు చేయలేదు. మీరు గబగబా అట్లా లుంగీబనీను మీదనే ఇంటెదురుగానే ఉండే ఖాతా దుకాణం దగ్గరకుపోయి అర్జంటుగా ఒక పేస్టు ఇమ్మంటారు. అతడు చాలా విచారంగా ముఖంపెట్టి "ఇంకా బోణీ కాలేదు సార్" అంటాడు. మీ అరికాలిమంట నెత్తికెక్కుతుంది. అంటే మళ్లీ ఇంట్లోకి రావాలి. డబ్బు తీసుకుని వాడిదగ్గరకు పోవాలి. ఇది పక్కా వ్యాపారమిళితమైన బోణీ. అతను సాధ్యమైనంతవరకూ నగదురూపంలో అమ్ముకునే ఆరాటంలో ఉన్నాడని గమనించి తక్షణమే అలాంటి చిరుఖాతాలను తీసేయడం మంచిది.

❖

జాతికుక్కయితే మాత్రం నాకేం భయం, దానికే నేనంటే హడల్!

ఎవరు నువ్వు?

ఆ అడవిలోని జంతువులన్నీ రోజుకొకటి సింహానికి ఆహారంగా వెళ్లాలి. ఆ రోజు కుందేలు వంతు వచ్చింది. చావడం ఇష్టంలేని కుందేలు బురద గుంటలో పొర్లాడి వెళ్లింది.

ఆ బురద ముద్దను చూసిన సింహం : ఎవరు నువ్వు?

కుందేలు : నేను మహారాజా! ఇవాళ మీకు ఆహారం కావాల్సిన కుందేలును.

సింహం : ఛీ... ఛీ... పో... పో... మళ్లీ నా కంటపడ్డావంటే చంపుతా.

- లిఖిత



గ్రేడ్

మాస్టార్: ఏరా, రఘూ! నేను క్లాసులో లేనంతమాత్రాన మాట్లాడ్డమేనా?

రఘు: నేనేం మాట్లాడలేదు సార్

మాస్టార్: పైగా అబద్ధాలొకటి.. మాట్లాడకపోతే నీ పేరెందుకు రాస్తాడు అనీల్?! నీ సంగతేంటి, దుర్గా, ఎందుకస్తమానం దిక్కులు చూస్తూ కూర్చోవడం? తిన్నగా కూర్చుని చదువుకోలేవా? కిరణ్, నువ్వేంటిరా, తెగ నవ్వుతున్నావంట?.. ఛఛ, ఇంత బుద్ధిలేనివాళ్ళేంట్రా మీరు? మీ అందరికీ 'డి'గ్రేడ్ వచ్చింది తెలుసా?!

ఆ మాటలు విని రఘు కిసుక్కున నవ్వాడు.

మాస్టార్: సిగ్గుతో తలొంచుకోవాల్సింది పోయి నవ్వుతున్నావా?

రఘు: అనీల్ తప్పచేస్తే నేనెందుకు సార్ తలొంచుకోవడం?

మాస్టార్: ఏంటీ?

రఘు: లీడర్‌షిప్ ఇచ్చారుకదాని తనకి నచ్చనివాళ్ళందరిమీదా కంప్లెయింట్లు రాశాడు... మీరు 'డి'గ్రేడ్ వరకే పెట్టారు కాబట్టి సరిపోయింది, లేదంటే 'జడ్'గ్రేడ్ రాసేవాడు - అని తాపీగా చెప్పి కూర్చున్నాడు రఘు.

- లేఖ

వంకాయకూర

రమణి: ఏంటీ, ఎంత రుచిగా వంకాయకూర చేసినా మీ ఆయన మెచ్చుకోలేదా?

హేమ: అవునే, ఈ మగవాళ్ళంతా ఇంతే

రమణి: పోనీలేవే, అతనికి మెచ్చుకునే అలవాటు లేదేమో, 'మా ఆవిడ బాగా వంటచేస్తుందని' మనసులో అనుకుని వుండొచ్చు కదా

హేమ: అదేంకాదు, మనసులో అనుకునే అలవాటేంలేదు, ఉత్త చాంచల్యం అంతే..

రమణి: చాంచల్యమేంటే?

హేమ: బుద్ధి స్థిరంగా లేకపోవడం. మొన్న ఈ కూర చేసినరోజున తెగ మెచ్చుకుని ఆకాశానికి ఎత్తేసిన పెద్దమనిషి, నిన్నటికే మాట మార్చేసి 'పరవాలేదు'తో సరిపెట్టాడు. ఇక ఇవ్వాళేమో ఆముదం తాగిన ముఖంపెట్టి కొద్దిగా తిని మిగిలింది వదిలేసి చెయ్యి కడిగేసుకున్నాడు

రమణి: మా తల్లే, మొన్నటికూరకి ఇవాళ కూడా కాంప్లిమెంట్లు కావాలా నీకు? - అని నోరు వెళ్ళబెట్టింది.

- ఎన్నార్

మనసా... తెలుసా?

కౌన్సెలింగ్ సైకాలజిస్ట్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనర్, ఫోన్ : 9849130141

హిప్నో కమలాకర్

అతనెందుకలా...

నేను డిగ్రీ ఫస్టియర్ చదువుతున్నాను. మాది మధ్యతరగతి కుటుంబం. అందుకే ఇంటర్మీడియట్‌లో వుండగానే రిసెప్షనిస్టుగా ఉద్యోగంలో చేరాను. అక్కడ నాకొక అబ్బాయితో పరిచయమేర్పడింది. అది ప్రేమగా మారింది. ఒక సంవత్సరం గడిచింది. అతను మరొక అమ్మాయి వెంట పడడం మొదలెట్టాడు. నేను నిలదీసి అడిగాను. అది 'ఫ్రెండ్షిప్ మాత్రమే' అని తేల్చేశాడు. అయితే అతని ఫ్రెండ్స్ ద్వారా, అది ఫ్రెండ్షిప్ కాదు ప్రేమే అని తెలిసింది. ఏదైతేనేం నేనతన్ని మరచిపోడానికి ప్రయత్నించసాగాను. ఈలోగా నాకు మరొక వ్యక్తితో పరిచయమేర్పడింది. ఇతను ముస్లిం. మా అన్నయ్యకు క్లోజ్ ఫ్రెండ్. అంచేత నేను కూడా అతణ్ణి అన్నయ్యా అని పిలుస్తూ సరదాగా వుంటాను. దీన్ని చూసి నా ప్రేమికుడు నన్ను నిలదీస్తున్నాడు. బాధపెడుతున్నాడు. ఇతని పోరు పడలేక చేస్తున్న ఉద్యోగం మానేశాను. చాలా చిరాగ్గా వుంది, నేనేం చేయాలో సలహా ఇవ్వండి.

దీపిక, కరీంనగర్

ప్రేమలో పరస్పర విశ్వాసం ఎంతో అవసరం. విశ్వాసంలో అపశృతులు వుంటే, ఆ ప్రేమ పెళ్లి వరకూ కొనసాగదు. ఉద్యోగం మానేసిన తర్వాత కూడా మీరు సోదరునిగా భావించే వ్యక్తితో అతను మీ సంబంధాన్ని తప్పుగా భావిస్తున్నాడా? ఒకవేళ అలానే మాట్లాడుతూ వుంటే, ఆ ప్రేమ గురించి మీరు పునరాలోచించుకోవడం మంచిది. అట్లాగే, మీరు అతని 'కొత్త' స్నేహితురాల్ని తప్పపట్టడం మూలంగా, అతను కావాలని అట్లా అంటున్నాడేమో పరిశీలించండి. అలా కాని పక్షంలో మీరు జాగ్రత్త పడండి.

నెగెటివ్ ఆలోచనలు పోయేదెలా....

నా వయసు 17 సంవత్సరాలు. నేను ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్నాను. నా సమస్యేమిటంటే నాకు నెగెటివ్ ఆలోచనలు విపరీతంగా వస్తుంటాయి. ఎంత గట్టిగా ప్రయత్నించినా ఆగట్లేదు. వాటిని ఆపడం నావల్ల కావడం లేదు. ప్రతి చిన్న విషయాన్నీ నాకు అన్వయించుకుని, నాకు వ్యతిరేకంగా అందరూ ఏదో చేస్తున్నారని వూహించుకుంటాను. నాకిష్టంలేని వ్యక్తులు ఏదైనా మాట్లాడుకుంటూంటే వాళ్లు నా గురించే ఏదో మాట్లాడేసుకుంటున్నారని వారితో తగవులాడుతుంటాను. ఈ నెగెటివ్ ఆలోచనలు పోయేదేలా?

రామరాజు, అనంతపురం

ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్, ఆత్మవిశ్వాస లోపం, సోషల్ ఫోబియా మీ సమస్యకు ప్రధాన కారణాలు. ఎప్పుడూ మీ గురించే ఆలోచించడం, మీ విషయాలే చర్చించడం ఇతరులకు సాధ్యం కాదు. జీవన స్థితిగతుల రీత్యా వాళ్ల గురించి వాళ్లు ఆలోచించుకోవడానికే తీరిక ఉండదు. అందుకే మానవతా విలువలు దెబ్బతింటున్నాయి. కాబట్టి మీ గురించి ఆలోచించే తీరుబడి ఇప్పుడు ఎవరికీ లేదు. ఒకవేళ ఎప్పుడైనా, ఎవరైనా ఆలోచించినా అది కాకతాళీయమే తప్ప మరొకటి కాదు. అసలు మీ గురించి నెగెటివ్‌గా ఆలోచించే అవసరం వారికేంటి? దానివల్ల కలిగే ప్రయోజనం ఏమిటని మీరు ఆలోచించగలిగేతే మీ సమస్య మటుమాయమవుతుంది.

సమస్యలకు ఆహ్వానం

మీకు లేదా మీవాళ్ళకు మానసికమైన సమస్యలేమైనా తలెత్తాయా? ఏం చేయాలో పాలుపోక సతమతమవుతున్నారా? అయితే వెంటనే ఆ సమస్యేంటో మాకు తెలియజేయండి. సైకాలజిస్ట్ **శ్రీ హిప్నో కమలాకర్** తగిన పరిష్కారాన్ని తెలియజేస్తారు.

మా చిరునామా: ప్రజాశక్తి ఆదివారం అనుబంధం, స్ట్రీట్ నెంబర్: 1, అశోక్ నగర్, హైదరాబాద్ - 500 020.

విజ్ఞాన వీచిక

ఎస్. వెంకట్రావు

గొరిల్లా గొరిల్లా

మానవుడు ప్రకృతిని శాసించడం ప్రారంభించాక అనేక జాతుల జీవులను అంతం చేశాడు. కొన్ని జంతువులనో, వృక్షాలనో అంతం చేయడం వేరు. వాటి జాతులనే అంతం చేయడం వేరు. ఆహారంకోసం జంతువులను, మొక్కలను తింటే అవి మళ్లీ వృద్ధి చెందుతాయి. కాని ఒక జాతిని నాశనంచేస్తే తిరిగి ఆ జాతి అభివృద్ధిచెందడం సాధ్యంకాదు. నిజానికి ఒక జాతి జంతువులు ఇతర జంతువులనో, మొక్కలనో ఆహారంగా



తీసుకుంటాయి. అలాగే తాము ఆహారంగానూ ఉపయోగపడతాయి. ఇది ప్రకృతి ధర్మం. ఏ జాతీ మరో జాతి జీవులను పూర్తిగా నాశనం చేయలేదు. కాని ఒక్క మానవుడు మాత్రం ఆ పనిచేయగలడు, చేస్తున్నాడు కూడా. మానవునికి పనిముట్టుమీద అదుపు రావడమే దీనికి కారణం.

ఇప్పుడు మన సమస్య గొరిల్లాలకు సంబంధించింది. పరిణామక్రమంలో మానవునికి పూర్వీకులైన 'నరవానరాల్లో' ఇప్పటికీ భూమ్మీద బ్రతికున్న నాలుగు జాతుల్లో గొరిల్లా ఒకటి. ఇప్పుడివి కూడా ప్రమాదంలో పడ్డాయి. కారణం మానవుడే.

గొరిల్లాలు ప్రధానంగా ఆఫ్రికా ఖండంలోని దట్టమైన అడవుల్లో నివసిస్తాయి. ఇప్పుడివి నివసించే ప్రాంతాలన్నీ యుద్ధాలతో కునారిల్లుతున్నాయి. యుద్ధాలు, జంతువేట, అడవుల నరికివేత, రోగాలు గొరిల్లాలకు ప్రాణాంతకాలవుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే గొరిల్లాల్లోని నాలుగు ఉప-జాతుల్లో మూడు ఉప-జాతులు మరో దశాబ్దంలో విలుప్తం (అంతం) అవుతాయని జంతుశాస్త్ర నిపుణుల అంచనా. ఇది నిజమా కాదా తెలుసుకోవాలంటే గొరిల్లా జాతులు, అవి నివసించే ప్రాంతాలు, అక్కడి పరిస్థితుల గురించి కొన్ని వివరాలు తెలుసుకోవాల్సి ఉంటుంది.

గొరిల్లాలు: వీటిని 'గొరిల్లా గొరిల్లా' అనే శాస్త్రీయ నామంతో పిలుస్తారు. అంటే అది ఆ జాతి పేరన్నమాట. ఇందులో నాలుగు ఉప-జాతులున్నాయి.

1. తూర్పు పల్లపు ప్రాంత గొరిల్లాలు. వీటి జాతినామం చివర గ్రావెర్ అనే ఉపనామం ఉంటుంది. కనుక వీటిని గ్రావెర్స్ గొరిల్లాలు అంటారు. ఇవి జైరె దేశంలోని తూర్పు ప్రాంతంలో నివసిస్తాయి. ప్రస్తుతం ఈ ఉపజాతికి చెందిన గొరిల్లాలు రెండుమూడు వేలకు మించి లేవని సర్వే చేసినవారు చెబుతుండగా మరికొందరు 16,000 వరకు ఉండొచ్చని చెబుతున్నారు. కానీ గొరిల్లా మాంసంకోసం మధ్య ఆఫ్రికా రిపబ్లిక్‌లో వీటిని వేటాడి తింటుండడంవల్ల ఈ ఉప-జాతి వేగంగా క్షీణిస్తోంది. ఇదే పరిస్థితి మరో పదేళ్లు కొనసాగితే మనకు ఈ గొరిల్లాలు భూమ్మీద కనిపించవని చెబుతున్నారు.

2. రెండో ఉప-జాతిని పర్వత గొరిల్లాలు అంటారు. ఇవి ఉగాండా, ర్వాండా సరిహద్దుల్లో కేవలం 700 మాత్రమే ఉన్నాయి. ఇవి పూర్తిగా విలుప్తమయ్యేందుకు సిద్ధంగా ఉన్నాయి. అడవులు నరకడం, జంతు వేట, వ్యాధులు వీటి ప్రాణాలను హరిస్తున్నాయి.

3. క్రాస్ రివర్ గొరిల్లాలు నైజీరియా, కామెరూన్ సరిహద్దుల్లో కేవలం 200 మాత్రమే ఉన్నాయి. వీటికి కూడా పైన చెప్పిన కారణాలనుండి ముప్పు పొంచి ఉంది. జాగ్రత్తలు తీసుకోకపోతే దశాబ్దకాలంలో ఇవి లేకుండాపోతాయంటున్నారు.

4. పశ్చిమ పల్లపు ప్రాంత గొరిల్లాలు. మనకు జంతు ప్రదర్శన శాలల్లోగాని, సినిమాల్లోగాని ఎక్కువగా కనిపించేవివే. ఇవి ఆఫ్రికాలోని కాంగో, జైరె, కామెరూన్, గాబన్, గినియా, నైజీరియా దేశాల్లోని దట్టమైన అడవుల్లో నివసిస్తాయి. అబోలా వైరస్ వల్ల 90 శాతం గొరిల్లాలు చనిపోగా ఇప్పుడు మొత్తంగా 94,000 వరకు నివసించి ఉన్నాయని చెబుతున్నారు. వాటి నివాసం దట్టమైన అడవి కాబట్టి సర్వేలో కొన్ని దొరకవని, అందువల్ల వాటి సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉంటుందని కొందరు చెబుతున్నారు. ఏమైనా మొత్తంగా ప్రపంచంలో గొరిల్లాల సంతతి సుమారు లక్ష మాత్రమే ఉందన్న విషయం ఇక్కడ గమనించాలి.

ఇక గొరిల్లాల జీవన విధానానికీ, మనిషి జీవన విధానానికీ మధ్య చాలా సారూప్యాలున్నాయి.

◗ గొరిల్లాలు చిన్న బృందాలుగా నివసిస్తాయి. ఒక్కో బృందం ఒక్కో కుటుంబం.

◗ మానవుల్లాగే ఆడ గొరిల్లా గర్భం ధరించాక తొమ్మిది మాసాలకు బిడ్డను కంటుంది. పుట్టిన బిడ్డ ఆరు మాసాలవరకు తల్లిపాలు తాగి పెరుగుతుంది. మూడునాలుగేళ్ళవరకు తల్లిదండ్రులను అంటిపెట్టుకుని తిరుగుతుంది. క్రమంగా ఘన ఆహారం తీసుకోవడం ప్రారంభిస్తుంది.

◗ గొరిల్లాలు పూర్తిగా శాకాహారులు.

◗ గొరిల్లా బృందానికి అందరికన్నా ఎక్కువ వయసున్న మగ గొరిల్లా నాయకత్వం వహిస్తాడు. ఈ గొరిల్లాకు వీపుమీద జుట్టు కాస్తా వెండి రంగులోకి మారుతుంది. అది గొరిల్లా వయసునూ, పరిణతినీ సూచిస్తుంది. గొరిల్లా వయసు 10-12 ఏళ్లు వచ్చేసరికి వీపుమీది వెంట్రుకలు వెండిరంగులోకి మారడం ప్రారంభిస్తాయి.

◗ గుంపులో ఒక మగ గొరిల్లా యుక్త వయసుకు వస్తే వెంటనే దాన్ని ఇతర గొరిల్లాలు గుంపునుండి తరిమేస్తాయి. అప్పుడా గొరిల్లా వేరే గుంపును వెతుక్కుంటూపోతుంది. ప్రకృతిలో రక్తసంబంధీకులమధ్య లైంగిక సంబంధాన్ని నివారించే ఏర్పాటుగా దీన్ని చెప్పుకోవచ్చు. ఇలా గుంపును వీడిన మగ గొరిల్లాలు కొన్ని చేరి ఒక్కోసారి సొంత బృందాన్ని ఏర్పాటు చేసుకుంటాయి. ఇతర గుంపులనుండి వచ్చే ఆడ గొరిల్లాలతో కలిసి అవి ప్రత్యేక బృందాలౌాయి. అలా గొరిల్లా బృందాలు (కుటుంబాలు) అభివృద్ధిచెందుతాయి.

◗ గొరిల్లా కుటుంబాల్లో ప్రతి ఒక్కరికీ నిర్దిష్ట స్థానముంటుంది. వెండి వెంట్రుకల యజమాని గొరిల్లాగుంపు ముందు నడుస్తుంది. యుక్తవయసుకు వచ్చిన మగ గొరిల్లాలు గుంపు వెనుక అన్నివైపులా రక్షణగా ఉండి నడుస్తాయి. మధ్యలో ఆడ గొరిల్లాలు, పిల్లలు ఉంటాయి.

ఆడ గొరిల్లాల్లో వయసులో పెద్దది గుంపులో ప్రధాన స్థానం ఆక్రమిస్తుంది. ఎక్కువ పిల్లలున్న ఆడ గొరిల్లాలకు ప్రాధాన్యత లభిస్తుంది.

శాస్త్రవేత్తలు అనేక సంవత్సరాలపాటు గొరిల్లాల జీవన విధానాన్ని జాగ్రత్తగా గమనించి వెల్లడించిన వాస్తవాలివి. వీటి జీవన విధానాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే ఆదిమానవుని జీవన విధానంలోని చాలా విషయాలు మనకు అర్థమౌతాయి. కాని సమస్యేమంటే ఈ గొరిల్లాలు ఎంతకాలం భూమ్మీద ఉంటాయి, తెలివితక్కువ మానవుడు వీటిని ఎంతకాలం జీవించనిస్తాడు అనేదే. గత పదేళ్లకు పైగా కాంగోలో జరుగుతున్న అంతర్యుద్ధం అన్నిటికన్నా ఎక్కువగా గొరిల్లాల ప్రాణాలు తీస్తోంది. యుద్ధంవల్ల అడవులు పాడవడం, రెండువైపులా సైనికులు దొరికిన గొరిల్లాలను చంపి తినడంవల్ల ఇవి అంతమవుతున్నాయి. ప్రభుత్వాలు అభయారణ్య ఏర్పాటు చేయడం, జంతు ప్రదర్శనశాలల్లోకి తరలించడం వంటి కొన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఇవి సరిపోవడంలేదు. నిజానికి గొరిల్లా సంతతిని రక్షించి, గొరిల్లా టూరిజాన్ని ప్రోత్సహించడంవల్ల అనేక ఆఫ్రికా దేశాలకు విపరీతమైన ఆదాయం వస్తుంది. ఇటీవలికాలంలో ఉగాండా అటువంటి కృషి చేయడంవల్ల టూరిజంద్వారా దాని ఆదాయం అనేక రెట్లు పెరిగిందట.

గొరిల్లాలు ఆఫ్రికావారివే కావచ్చు కాని అవి మానవజాతి అంతా కలిసి రక్షించుకోవలసిన విలువైన ఉమ్మడి జీవ సంపద.

❖

కొత్త పుస్తకాలు

పద పరిజ్ఞాన పరిచయం

మార్క్సిస్టు పాఠాల సిరీస్‌లో ఇది నాల్గవది. మార్క్సిజం అధ్యయనంకోసం అవసరమయ్యే పదాలకు అర్థాలను వివరించడం కోసం ప్రత్యేకంగా ఈ చిరు పుస్తకాన్ని రచించారు. ఇందులో వర్గం అంటే ఏమిటి, దానిని ఎలా అర్థం చేసుకోవాలో వివరించారు. రెండవది వర్గాలు అంటే సామాజిక వర్గాలు. ఈ వర్గాలు ఒకదానితో ఒకటి విభేదిస్తూ ఉంటాయి. ఈ విభేదాలు ఉత్పత్తి విధానానికి సంబంధించి వాటి సంబంధాలను బట్టి ఉంటాయి. మార్క్సిజం అధ్యయనంకోసం ఈ వర్గాలను చాలా సునిశితంగా అర్థం చేసుకోవడం అత్యంతావశ్యకం. దీనికి సంబంధించిందే వర్గ పోరాటం. భిన్న వర్గాల ప్రయోజనాలు ఒకదానితో ఒకటి పొసగవు. అలాంటప్పుడు ఈ వర్గ పోరాటాలు తప్పనిసరిగా వస్తాయి. ఆ పోరాటంలో ఏ వర్గానిది పైచేయి అయితే అది విజయం సాధించి ఆ వర్గ పునాదులమీద నూతన సమాజాన్ని నిర్మిస్తుంది. ఇలా అనేక వర్గాలను దాటుకుంటూ నేడు మనం పెట్టుబడిదారీ విధానం, సామ్యవాద సమాజాలలో అడుగుపెట్టాం. ఈ వర్గ పోరాటం బానిసకు - బానిస యజమానికి, ఫ్యూడల్ భూస్వామికి - వ్యవసాయకూలీకి, బూర్జువా వర్గానికి - శ్రామిక వర్గానికి మధ్య జరుగుతుంది. ఇందులో ఏ వర్గానిది పైచేయి అయితే ఆ వర్గం అధికారాన్ని చేపడుతుంది. శ్రామిక వర్గ నియంతృత్వం అనేది సోషలిస్టు సమాజంలో మనకు కన్పిస్తుంది. రాజ్యానికి సంబంధించి మార్క్సిజంలో ప్రముఖ భావన శ్రామిక వర్గ నియంతృత్వమని లెనిన్ అన్నారు. సోషలిస్టు విప్లవ ప్రధాన అంశం ఇది. ఇంకా ఇందులో ఊహాకల్పిత సోషలిజం, ఫేబియన్ సోషలిజం, ఆచార్య పీఠ సోషలిజం, క్రైస్తవ సోషలిజం వంటి భావనలను కూడా వివరించారు. సోషలిజం గురించి సవివరంగా, చక్కగా అర్థమయ్యేలా వివరణ ఇచ్చారు. ఇందులో ప్రజలే యాజమాన్యం కలిగి ఉంటారు కాబట్టి సోషలిజం ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేసుకుంటుంది. శ్రామిక ప్రజలంతా ఈ ప్రక్రియలో చురుకైన పాత్ర తీసుకునేట్లు ప్రోత్సహించడం ఉంటుంది. సోషలిజం-కమ్యూనిజం అనే పదాలను పరిశీలిస్తే కమ్యూనిస్టు సామాజిక, ఆర్థిక నిర్మాణంలో సోషలిజం దిగువ దశ కాగా కమ్యూనిజం ఉన్నత దశ. ఇంకా ఇందులో మానవతావాదం గురించి కూడా వివరించారు. ప్రజాస్వామ్యం అనేది అధిక సంఖ్యాకుల ఇష్టానిష్టాలకు అల్ప సంఖ్యాకులు లోబడి ఉండాలని ఇది చాటుతుంది. ప్రజాస్వామ్యాన్ని మార్క్సిజంలో ఎంతో విస్తృతార్థంలో వాడతారు. ప్రజాస్వామిక సోషలిజం, శ్రమ విభజన, సోషలిస్టు రాజ్యం, పెట్టుబడిదారీ విధానం వంటి మొత్తం 22 పదాలను అర్థం చేసుకునేందుకు వీలుగా వివరణలనిచ్చారు. మార్క్సిజం పట్ల ఎలాంటి అవగాహనా లేనివారు ముందుగా ఈ అర్థాలను తెలుసుకుంటే తరువాత దాని అధ్యయనం సులభమవుతుంది. విషయ పరిజ్ఞానానికి ఉపయుక్తమయ్యే పుస్తకమిది.



- సింహాద్రి సరోజిని

(మార్క్సిజం పాఠాలు (పదజాలం వివరణలు),
తెలుగు సేత: ఆర్వీయార్,
వెల: 6 రూపాయలు, పేజీలు: ?
ప్రతులకు: విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు)

కన్నీటి లిపి

వెల:40/-,
పేజీలు:123
ప్రతులకు:
విశాలాంధ్ర బుక్ హౌస్,
ప్రజాశక్తి బుక్‌హౌస్
నవోదయ బుక్‌హౌస్‌లలో...

స్వరతంత్రులు

లలిత గేయ కవితా మాలిక

వెల:40/-,
పేజీలు:38
ప్రతులకు:
విశాలాంధ్ర బుక్ హౌస్‌లలో...



బాదం మిల్క్

కావలసిన పదార్థాలు

బాదం పప్పు - ఒక కప్పు కపంచదార - రెండు కప్పులు క పాలు - నాలుగు కప్పులు క ఎస్సెన్స్ - ఒక స్పూన్ క యాలకులపొడి - అరస్పూన్ క రంగు - నచ్చినది చిటికెడు

తయారుచేసే పద్ధతి

బాదం పప్పును నీటిలో ఓపూట నానబెట్టుకోవాలి. ఆనక పొట్టు తీసివేసి, మిక్సీలో వేసి మెత్తగా పేస్ట్ చేసుకోవాలి. పాలను గిన్నెలో పోసి ఎర్రగా మరిగించుకోవాలి. దీనిలో ఇందాకటి బాదం ముద్దను, పంచదారను వేసి బాగా కలియబెట్టాలి. కొద్దిసేపు అలాగే స్టౌ మీద ఉంచాలి. దించేముందు ఎస్సెన్స్, యాలకులపొడి కలపాలి. మీకు నచ్చిన రంగునూ కలుపుకోవచ్చు. చల్లారిన తరువాత ఫ్రిజ్‌లో పెట్టాలి. ఇది రుచికరమేగాక బలాన్నీ ఇస్తుంది.

- జ్యోతి

రుచి

సగ్గుబియ్యం వడలు

కావలసిన పదార్థాలు

సగ్గుబియ్యం - రెండు కప్పులు క బంగాళాదుంపలు - రెండు పెద్దవి క వేరుశనగ పప్పు - ఒక కప్పు క పచ్చిమిర్చి తరుగు - పావుకప్పు క కొత్తిమీర తరుగు - అరకప్పు క ఉప్పు - తగినంత క నూనె - సరిపడ

తయారుచేసే పద్ధతి

సగ్గు బియ్యాన్ని ఓ నాలుగు గంటలపాటు నానబెట్టాలి. తరువాత నీటిని తీసివేసి ఓ గిన్నెలో వేసుకోవాలి. బంగాళాదుంపలను ఉడికించి, పొట్టుతీసి మెత్తగా చిదుముకుని సగ్గు బియ్యంలో వేసుకోవాలి. వేరుశనగపప్పును వేయించి, పొట్టు తీసి, పొడిచేసి ఇందులో వేయాలి. ఇందులో పచ్చిమిర్చి తరుగు, కొత్తిమీర తరుగు, ఉప్పు వేసి బాగా కలపాలి. మరుగుతున్న నూనెలో ఇందాకటి ముద్దను చిన్న వుండలుగా తీసుకొని, వడలా చేసి నూనెలో వేసి, ఎర్రగా వేగిన తర్వాత తీయాలి.

కలంస్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీకూ కూడా వీళ్లలాగా కలంస్నేహం చెయ్యాలని ఉందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకుని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ **కలర్‌ఫొటో**ను అతికించి పోస్టు చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలూ చెప్పండి. వాళ్లకు కూడా కలంస్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్:

కలం స్నేహం, **బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.**

పేరు : ఎం.కుమారి
వయసు : 13 సం॥
చదువు : 9వ తరగతి
స్కూలు: ఆర్.సి.ఎం హైస్కూల్
హాబీలు: ప్రజాశక్తి పేపర్ చదవడం, టీవీ చూడడం, ముగ్గులు వేయడం.
చిరునామా : ఎం.కుమారి,
డాటరాఫ్ రామలక్ష్మి, డోర్ నం: 82/31, కొత్త వీధి, 8వ వార్డు, శ్రీరామ కోవెల దగ్గర, నర్సీపట్నం, విశాఖ జిల్లా. 531 116.

పేరు : పి.తేజ
చదువు : 3వ తరగతి
స్కూలు: ప్రాథమిక పాఠశాల
హాబీలు: ఆటలు ఆడడం
చిరునామా : పి.తేజ,
సన్నాఫ్ అంజయ్య, ప్రాథమిక పాఠశాల, కల్వకుంట్ల (గ్రా), మునుగోడు (మం), నల్గొండ జిల్లా.

పేరు : పి.రాజా
చదువు : 8వ తరగతి
స్కూలు : జిల్లా పరిషత్ హైస్కూల్, కోంపల్లి.
లక్ష్యం : క్రికెటర్ అవడం
హాబీలు : పుస్తకాలు చదవడం, క్రికెట్ ఆడడం.
చిరునామా : పి.రాజా,
సన్నాఫ్ అంజయ్య, కల్వకుంట్ల (గ్రా), మునుగోడు (మం), నల్గొండ జిల్లా.

పేరు : సరికొండ నాగార్జున రాజు
వయసు : 6 సం॥
చదువు : 2వ తరగతి
స్కూలు: ట్రినిటి కాన్వెంట్
లక్ష్యం: ఇంజనీర్ అవడం
హాబీలు: ఆడుకోవడం.
చిరునామా : సరికొండ నాగార్జున రాజు,
సన్నాఫ్ రవిప్రకాశ రాజు, మునగాల (పోస్ట్ & మం), నల్గొండ జిల్లా. 508 233.

పేరు : సరికొండ మల్లిఖార్జున రాజు,
వయసు : 10 సం॥
చదువు : 4వ తరగతి
స్కూలు: ట్రినిటి కాన్వెంట్
లక్ష్యం: డాక్టర్ అవడం
హాబీలు: టీవీ చూడడం, క్రికెట్ చూడడం.
చిరునామా : సరికొండ మల్లిఖార్జున రాజు,
సన్నాఫ్ రవిప్రకాశ రాజు, మునగాల (పోస్ట్ & మం), నల్గొండ జిల్లా. 508 233.

పేరు : పాల సాయికిరణ్
వయసు : 7 సం॥
చదువు : 1వ తరగతి
స్కూలు: సెయింట్ జోసఫ్ హైస్కూల్
హాబీలు: చదవడం, బొమ్మలు గీయడం.
చిరునామా : పాల సాయికిరణ్,
సన్నాఫ్ రామలింగయ్య, క్వార్టర్ నెం. ఎస్.డి.257, ఆర్.కె.పి., ఆదిలాబాద్ జిల్లా.